ప్రజాశక్తి

Vol. 5, no. 15

(Oct. 11, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 5, no. 15

(Oct. 11, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 5 బుధవారం 11-10-44 సంచిక 15

గాంధీ - జిన్నాలు తిరిగి కలిసికోవాలి



— పి. సి. జోషి —

గాంధి - జిన్నా రాయబారాలు విఫలమయ్యాయనే వార్త భారత స్వాతంత్ర వ్యతిరేకులకు సంతోషం కలిగించింది. స్వాతంత్ర్యం కాంక్షించే భారతీయు లందరికీ ఈ వార్త హృదయవిదారకంగా వుంది. దేశమంతా విషాదఛాయలు వ్యాపించాయి. సమావేశం నుంచి ప్రజలు ఎంత మహావిజయాన్ని ఆశించారో అంత కృంగిపోయారు.

ప్రతిష్టంభనతొలగించడానికి, స్వాతంత్ర్యం సంపాదించడానికి ఐక్యమవ్వాలని కోరిన వారంతా విచారపడుతున్నారు. అపజయానికి కారణం మీరంటే మీరని ఒకరి నొకరు నిందించుకుంటున్నారు. పాకిస్తాన్‌ను గాంధీజీ అంగీకరించలేదు కాబట్టి విఫలమయ్యాయని ముస్లిమ్‌లీగ్‌వారు అంటున్నారు. జిన్నా కాంగ్రెసుతోకలసి స్వాతంత్ర్యంకోసంపోరాడ టానికిఅంగీకరించలేదనీ, పాకిస్తాన్‌పైప్రజాభి ప్రాయం తీసికోడానికి సిద్ధపడలేదనీ, అందు వల్లనే రాయబారాలు విఫలమయ్యాయని కాంగ్రెసువారంటున్నారు.

కమ్యూనిస్టులమైన మేము వీరిద్దరి వాద నలనూ అంగీకరించము. కాంగ్రెసు-లీగులు దేశంలోని ప్రధానమైన రెండు రాజకీయ సంస్థలు. స్వాతంత్ర్యంకోసం పోరాడే సైని కులు రెంటిలోనూ వున్నారు. పరస్పర అప నమ్మకాలవల్ల ఒకరిదృక్పథాన్ని మరొకరు సందేహంతో చూస్తున్నారు. ఉభయుల ఆశ యాలకు, అనుభవాలకు అనుగుణ్యంగా విశ దీకరించలేక పోతున్నారు.

మాపార్టీ కాంగ్రెసు - లీగు ఐకమత్యం కోసం నిలబడి పనిచేస్తూంది. గత రెండు న్నరయేళ్ళనుండి ఒకరి దృక్పథాన్ని మరొక రికి తెలియచేయడానికి కృషిచేస్తోంది. ముస్లి ముల పాకిస్తాన్ కోర్కెను మేము కాంగ్రెసు వాదులలో ప్రచారం చేశాము. జాతీయ ప్రభుత్వం కొరకు, కాంగ్రెసునాయకుల విడు దలకొరకు, ముస్లిమ్ ప్రజలలో ప్రచారం కొనసాగించాము.

ఐక్యతకు వ్యతిరేకులైనవారు, విధ్వంసక చర్యలు ప్రోత్సహించినవారు, మమ్ము ప్రభుత్వ ఏజెంట్లని దుష్ప్రచారం చేసారు. పాకిస్తాన్ ప్రచారం లీగ్‌కంటే బాగా చేస్తున్నామని ఆక్షేపించారు. ఇటు లీగులోని అభివృద్ధినిరో ధకులు మేము జాతీయప్రభుత్వం - కాంగ్రెసు నాయకుల విడుదల కావాలంటున్నాము గాన, మమ్ము కాంగ్రెసు ఏజెంట్లమని నిందించారు. మాకు దూరంగా వుండమని, తమ అనుచరు లకు హెచ్చరికలు పంపారు.

మేము యీ ఆటంకాలకు లక్ష్యపెట్టకుండా కాంగ్రెసు - లీగ్ ఐక్యత కావాలని ప్రచా రం చేశాము. క్రమంగా ప్రజాబలం సంపా దించాము. ఎట్టకేలకు విదేశీప్రభుత్వం చేతు లలో అనేక గుణపాఠాలు నేర్చుకొన్నాక కాంగ్రెసు - లీగు నాయకులు కలసికొన్నారు. జాతీయైక్యత త్వరలోనే సిద్ధించబోతూందని దేశమంతటితోపాటు మేముకూడా సంత పించాము.

కాంగ్రెసువాదులు, లీగ్ అనుచరులు అను కున్నట్లుగా "నాయకులు ఏదోవిధంగా రాజీ పడతారు. మనం వారి ఆజ్ఞకోసం వేచివుంటే చాలు!" అనే భ్రమ మాకులేదు. ఆ విషయమై నావ్యాసంలో (23-8-44 తేదీ "ప్రజాశక్తి"లో ప్రకటించబడింది) హెచ్చరించాను. ఒడంబడిక జరగాలంటే నాయకులు ఎన్నో ఆటంకాలను దాటాలని తెలియజేశాను. వారి జాబులను బట్టిచూస్తే నేను సూచించినట్లుగానే వారి రాయబారాలు భగ్నమయ్యాయని స్పష్ట పడుతుంది.

మేము ఐకమత్యంకోసం ప్రచారంచేశాం. ఒండొరుల దృక్పథాల యెడల వున్న అను మానాలను తొలగించడానికి, కృషిచేశాము. తద్వారా, నిర్మాణాత్మకమైన కొన్నిసూచనలు చేసే హక్కును, సంపాదించాము.

నాయకులు తమశక్తికొలది ప్రయత్నించి విఫలులయ్యారు. ఎవరి అనుచరులకు వారి నాయకులు అవలంబించిన పంథాలో తప్పేమీ కన్పించడంలేదు. ఇద్దరు నాయకులు మరల కలసికుంటామనే ఆశను వెల్లడించారు. కాని రెండుపక్షాలలోని దేశభక్తులు యీవిషయమై పునరాలోచించితేగాని ఈ ఆశలు నెరవేరవు. ఏ అభిప్రాయభేదాలు నాయకుల సమావేశం విఫలమవడానికి కారణమయ్యాయో, ఆవిభే దాలు, అనుచరుల మనస్సులలో కూడ వున్నాయి.

గాంధీ - జిన్నాల మధ్యవున్న భేదం, కాంగ్రెసు - లీగుల మధ్యవున్న భేదం. స్వాతంత్ర్యం అంటే వారికున్న వేర్వేరు దృక్పథాలనుంచి ఆభేదం వస్తూంది. ఆయన పంథా మార్చించాలని ఈయనా, ఈయన పంథా మార్చించాలని ఆయనా - ఇలా ఇరు వురూ ప్రయత్నించారు. అపజయం పొందారు. జిన్నా, లీగు యొక్క లాహోరు తీర్మానంపై తన వాదనకు ఆధార పరిచాడు. గాంధీజీ రాజాజీ సూచనలపై తన వాదానంతా ఆధారపరచాడు.

ఎవరికి వారు తమ తమ ఆదర్శాలకు అంటిపెట్టుకున్నారు. వారిద్దరూ దేశంలో రెండు ప్రధాన రాజకీయసంస్థలను నిర్మిం చారు. అందుచే వారికి కావలసినంత ఆత్మ విశ్వాసముంది. తమ కోర్కె ధర్మబద్ధమైన దనే అచంచల విశ్వాసముంది. ఏమంటే ఆకోర్కెల పునాదిమీదనే బ్రహ్మాండమైన ఉద్యమాలను నిర్మించగలిగారు. గాంధీజీ స్వరాజ్యోద్యమాన్ని, జిన్నా పాకిస్తాన్ ఉద్య మాన్ని నిర్మించారు.

ఒకరి ఆశయాలు న్యాయమైనవి అయి, మరొకరివిఅక్రమమైనవిఅయితే రెండోసంస్థ ఇంత పెద్దదిఅయ్యే అవకాశమేలేదు. ఒకరు మాత్రమేస్వాతంత్ర్యం ప్రజాస్వామ్యంకొరకు న్యాయంకొరకు నిలబడితే; మరొకరు మూఢ విశ్వాసాలపై, ప్రజల అమాయకత్వంపై ఆధారపడితే కోట్లకొలది ప్రజాబలాన్ని స్వరాజ్య, పాకిస్తాన్ ఉద్యమాలు సంపా దించగలిగేవి కాదు.

నిజంగా యిద్దరిమధ్య అభిప్రాయభేదా లున్నాయి. వాటిని జాగ్రతగా పరిశీలించాలి. మనలో నాటుకుపోయిన భావాలను పునరాలో చించుకోవాలి అణకువతో ఎదరివారిభావాలను అర్థంచేసికోడానికి ప్రయత్నించాలి. మనం కోరే స్వాతంత్ర్యాన్నే ఎదరివారు ఇంకో విధంగా కాంక్షిస్తున్నారని తెలసికోవాలి.

గాంధీజీ - కాంగ్రెసు ఆశయాన్ని, జిన్నా సాహెబ్ - లీగు ఆశయాన్ని, స్పష్టంగా వెల్ల డించారు. అయితే ఇద్దరూ ఎందువలన ఒడం బడికకు రాలేకపోయారు? అనే విషయాన్ని చూదాం.

ఇద్దరికీ అంగీకారమైన సూత్రాలను నిర్ణ యించలేకపోతే, సమిష్టిగా అందరంకలిసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడపడం సాధ్యం కాదు. నాయకులు ఒకరి నొకరు అర్థంచేసు కోడానికి ప్రయత్నించక ఒకరి నొకరు మార్చడానికే ప్రయత్నించారు. అందుచేతనే అపజయం పొందారు.

వారు ఒకరినొకరు ఎలా అర్థంచేసి కొన్నారో చూదాం. గాంధీజీ యిచ్చేవాడు, జిన్నాజీ పుచ్చుకునేవాడు. రాజాజీ సూచన లను మించి ముందుకు పోవడానికి గాంధీజీ సిద్ధపడలేదు. లాహోరు తీర్మానం నుంచి ఏమాత్రం వెనక్కిపోడానికి జిన్నాసాహెబు సిద్ధపడలేదు. సంప్రతింపులు విఫలమయితే ఎలాంటి భీకరఫలితాలు వస్తాయో నాయకు లిద్దరు ఎరుగుదురు. కాని ప్రతి ఒకరు తమ కోర్కెలను పట్టుకొని వ్రేలాడుతూ, ఇతరుల కోర్కెలను త్రోసివుచ్చారు.

ఇద్దరి దృక్పథంలోనూ న్యాయమైన ఒకేసూత్రం యిమిడివుంది. కాని దీనితో పాటు చెడుకూడ మిళితమైవుంది. వారి జాబులను యీ విధంగా మనం అర్థం చేసికోకపోతే పరస్పర దూషణకు దిగ జారుతాము. పూర్వపు అవిశ్వాసాలను వదలి తీవ్రంగా ప్రయత్నిస్తేగాని ఒండొ రుల దృక్పథాన్ని అర్థంచేసికోలేము.

లాహోరు తీర్మానం

జిన్నాసాహెబువాదనకు పునాది లాహోరు తీర్మానం. దానిసారాంశం ఏమిటి? 1929 నాటి లాహోరు కాంగ్రెసు సంపూర్ణస్వాతంత్ర్య తీర్మానం ఎంత ప్రాముఖ్యమైనదో, 1940 నాటి లీగు లాహోరు తీర్మానంకూడ అంత ప్రాముఖ్యమైనది. లీగు లాహోరు తీర్మానం ముస్లిములకు 'స్వతంత్ర ప్రభుత్వాలు' కావా లని కోరింది. బ్రిటీషుప్రభుత్వం ఛత్రంక్రింద ఇండియాలో ఎచటా స్వతంత్ర ప్రభుత్వం సాధ్యపడదు. దానితో పోరాడి సంపాదించాలి.

అనగా ఆ తీర్మానం ముస్లిం స్వాతంత్ర్యాన్ని కోరింది. అందుచే న్యాయమైనదే.

ఆ తీర్మానం ప్రస్తుతమున్న బ్రిటిషు సామ్రాజ్యవాదుల దాస్యత్వాన్నుండి స్వాతం త్ర్యం కోరింది. భవిష్యత్తులోరాబోవు హిందూ మెజారిటీనుండి స్వాతంత్ర్యం కోరింది.

ఆ తీర్మానం ముస్లిములు అధికసంఖ్యాకు లుగావున్న పశ్చిమోత్తర ప్రాంతంలోను, ఈశాన్యప్రాంతంలోను స్వతంత్ర ప్రభుత్వాలు కావాలని కోరింది. అందువల్లనే జిన్నా, ముస్లిం మాతృభూములు భారత కేంద్ర ప్రభుత్వం క్రింద వుండడానికి అంగీకరించడం లేదు. ఏమంటే, కేంద్రంలో హిందూ మెజా రిటీ వుంటుంది.

(మిగతా 3 వ పేజీలో)

"ప్రజలలో ప్రచారం అవసరం"

ముస్లింల ప్రత్యేక రాజ్యాంగ హక్కును గూర్చి యు. పి. కాంగ్రెసునాయకుని అభిప్రాయం

యు. పి. రాష్ట్ర కాంగ్రెసువాదుల కేంద్రవర్గము సభ్యుడు, సేఠ్ గోపాలనారాయణ సాక్సేనా "పీపుల్స్‌వార్" పత్రికకు యీక్రింది ప్రకటన యిచ్చారు:

"గాంధి - జిన్నా సమావేశం భగ్నమైనందుకు నిరాశ చెంద నవసరంలేదు. ఈ సమస్యనుగూర్చి ప్రజల్లో విరివిగా ప్రచారం చేయవలసివుంది. హిందువుల్లోనూ - ముస్లింలలోనూ కూడా ప్రచారం అవసరం. మనదేశంలో వేర్వేరు జాతుల ప్రజలు నానాటికి అభివృద్ధి చెందుతున్నారనీ, తాము నివసించే ప్రదేశాలలో స్వతంత్ర రాజ్యాంగహక్కును కోరుతున్నారనీ, ప్రజలకు తెలియ చెప్పవలసియుంది. భారతదేశం అంతా ఒకేజాతి అనడమూ పొర బాటే; రెండుజాతులే మనదేశంలో ఉన్నాయనడమూ పొరబాటే. ఈ విషయాన్ని స్పష్టంగా అర్థంచేసుకోవాలి. హిందువులు - ముస్లి ములు రెండుజాతులు అనే వాదనను ఖండించి ఊరుకోవడంవల్ల హిందూమహాసభపాలసీని అంగీకరించడమవుతుంది. రాజాజీ ప్రణా ళికను ఉపసంహరించుకొనేటట్లు చేయాలనే ప్రచారంలో కాంగ్రెసు వాదులెవరూ పడకుండా మొదట జాగ్రత్తపడాలి. వివిధజాతుల ప్రజలకు ప్రత్యేక రాజ్యాంగహక్కు ఉండితీరాలని కాంగ్రెసు వాదు ల్లోను, ముస్లింలీగర్లలోను, తీవ్రప్రచారం చేసి, యీ సూత్రానికి బలం చేకూర్చాలి."

ప్రజాశక్తి
బుధవారం 11-10-44

మన కర్తవ్యం

గాంధీ - జిన్నా సంప్రదింపులు భగ్నమయ్యాయనే సరికి అందరూ విచారంలో మునిగిపోయారు. ఆశాభంగం అందరినీ కుంగదీసింది. ఇప్పుడిప్పుడే వివిధ అభిప్రాయాలు తిరిగి స్వరూపం పొందుతున్నాయి.

కాంగ్రెసువాదుల్లో ఎక్కువమంది జిన్నాజీమీద నింద ఆరోపించారు. లీగునాయకత్వ పదవినుండి ఈయన్ని తొలగిస్తేనేగాని మోక్షం లేదన్నంత వరకు వెళ్ళారు కొందరు. జిన్నా కోరేది న్యాయమా కాదా అనే ఆలోచన వీరికక్కరలేదు. గాంధీ ఎంతవరకు పోగలడో అంతవరకు వెళ్ళాడు; కాని జిన్నా తనసూచనలేమీ చేయలేదు. అతనికి ఐక్యత అక్కరలేదు. అతను పోవలసిందే - అని వీరి విడివాదన. పాకిస్తాన్ తన జన్మహక్కు అనే జిన్నా సాహెబ్, ఈనాడు తనకోరికలో మార్పులు చేయడానికి పూనుకుంటే, తన ఆశయానికే తాను ద్రోహం చేసుకున్నవాడవుతాడని వీరు గుర్తించరు.

లీగు సభ్యులపైకూడా ఇంచుమించు యీధోరణిలోనే ఉంది. వీరు గాంధీజీని ఆడిపోస్తున్నారు. గాంధీజీ పాకిస్తాన్‌కి ఒప్పుకోనప్పుడు జిన్నాజీ ఏమీ చేయగలడు? అంటారు వీరు. గాంధీజీ ఒక మొండి హిందూఘటం - పాకిస్తాన్ మాత్ర 'అతని గొంతు దిగదు - ఇతనుతొలగిపోతేగాని కాంగ్రెసు పాకిస్తాన్‌కి అంగీకరించదని వీరిలో కొందరి దురభిమానుల వాదన.

పాకిస్తాన్ విషయంలో జిన్నాజీకి, అతని అనుచరులకు అభిప్రాయభేదాలు లేవు - ఈవిషయాన్ని కాంగ్రెసువాదులు గుర్తించాలి. అసంఖ్యాక కాంగ్రెసు సభ్యుల భావాలు గాంధీజీలో మూర్తీభవించాయన్న సంగతిని లీగువారు గుర్తించాలి.

అందువల్ల నాయకులను తొలగించాలనేది కాదు సమస్య. 'నాకు దేశభక్తియుత పంథాగా కనిపించేది, సోదర సంస్థలోని నా సోదరునికి ఎందుకలా కనిపించటంలేద'నే విషయాన్ని గురించి తీవ్రంగా ఆలోచించాలి. ఆత్మవిమర్శకదృష్టితో ఎవరి భావాలను వారు పరిశీలించుకొని, ఎదటివారి అభిప్రాయాలను ఓపికతో వినాలి - ఇదీ నేటి కర్తవ్యం. ఈనాడు మనం ఎడమొగం పెడమొగం కావచ్చు - కాని రేపు ఏకాభిప్రాయానికి రావాలి. రాకపోతే అధోగతి తప్పదు. ద్వేషాలు, దురభిమానాలు విచ్ఛిన్నకారకములు. ఓర్పు, కార్యదీక్ష, ఈనాడు ప్రతి దేశభక్తుడు కనబరచవలసిన లక్షణాలు. నిరాశతో నిండిఉన్న నేటి పరిస్థితుల్లో నవుకబారు వివాదాలు ఘోరప్రమాదానికి దారితీస్తాయి.

జిన్నామీద నిప్పులుచెరగడంవల్ల జిన్నా పతనంకాదు సరికదా, కాంగ్రెసు హిందూసంస్థ అని లీగ్‌వారికి గల అపోహ మరింతబలపడుతుందనేసంగతి కాంగ్రెసు పత్రికలు గుర్తించాలి. "జిన్నాపోవాలి" అనేనినాదం హిందూమహాసభది. కాంగ్రెసువారే ఈనినాదాన్ని ఉచ్చరిస్తే, తాము ఎవరితో జతకూడుతున్నారో గుర్తించాలి.

లీగు పత్రికలు గాంధీజీని ఎంతగా ఆడిపోస్తాయో, అంతగా కాంగ్రెసువారికి లీగుపట్ల అపోహలు పెరుగుతాయి; పాకిస్తాన్‌పట్లసంశయాలు హెచ్చుతాయన్న విషయాన్ని లీగువారు గుర్తించాలి "గాంధీపోవాలి" అనే నినాదం అభివృద్ధినిరోధక బ్రిటిషుపత్రికలది. లీగువారు దీనిని ఉచ్చరిస్తే లీగు సామ్రాజ్యవాద అనుకూలసంస్థ అనుభావం కాంగ్రెసువారిలో బలపడుతుంది.

★ మన రాజకీయాలు

సంప్రతింపులు విఫలమైనందుకు ★ శత్రువుల సంతోషం

బొంబాయిలో గాంధీ-జిన్నాలు కలుసుకున్నరోజున అందరి హృదయాల్లోను ఆశాజ్యోతి వెలిగింది.

సంప్రతింపులు విఫలమైనరోజున అది ఆరిపోయింది.

కాని, మన శత్రువుల ముఖాలు యింతింత అయాయి! అందరూ తిరిగి ఆనందంతో గంతులేస్తున్నారు! తిరిగి వారి భవనాలలో దీపాలు వెలిగాయి! లిన్‌లిత్గో ప్రభృతులు ఇండియాలో బ్రిటిష్ అధిపత్యం ఉండవలసిందేనని ఉపన్యాసాలు దంచుతున్నారు. కాంగ్రెసు నాయకుల్ని విముక్తిచేయ నవసరంలేదని ఆమెరీ ప్రభృతులు ధర్మపన్నాలు పలుకుతున్నారు. "లండన్ టైమ్సు" కరుడుకట్టిన సామ్రాజ్యవాద పత్రికల్లో ఒకటి. ఆపత్రిక సెప్టెంబరు 29వ తేదీని క్రింద విధంగా దొంగకన్నీళ్లు కార్చింది:

"పార్టీ కక్షలతో పెనగులాడని యితరులెవరైనా అయితే, యింతకంటె మంచిఫలితాలు కలిగియుండేవి." అల్పసంఖ్యాకులందరినీ సంతృప్తిపరచే రాజ్యాంగచట్టాన్ని బ్రిటిష్ అధికారవర్గం ప్రవేశపెట్టడం అవసరమని సూచించింది.

"ఎకనామిస్టు" పత్రిక ఎలా వ్యాఖ్యానించిందో చూడండి. బ్రిటిషువారు భారతదేశంనుండి వెళ్ళిపోవాలని గాంధీజీ. బ్రిటిష్ పెత్తనం ఉండగానే దేశాన్ని రెండిటిక్రింద విభజించాలని జిన్నా. పట్టుపట్టడంవల్లనే సంప్రతింపులు విఫలమయాయట. ఇంతకంటె పచ్చిఅబద్ధం ఉండబోదు.

బ్రిటిష్ పరిపాలకవర్గంయొక్క అడుగుజాడల్లో మెలిగే మన ప్రభుత్వ గులాములుకూడా సంతసం ప్రకటిస్తున్నారు.

"గాంధీ - జిన్నాల సంప్రతింపులు విఫలమైనందుకు మేం విచారపడ్డంలేదు," అంటూ సెప్టెంబరు 28వ తేదీని సర్ చమన్లాల్ సెతల్వాడ్, చంద్రావర్కార్‌లు ఒక సంయుక్త ప్రకటన గావించారు. "ఎట్టకేలకు సంప్రతింపులు విఫలమైనవార్త ప్రకటించబడినందుకు నేను సంతోషిస్తున్నాను." అని డాక్టర్ ఖరే (వైస్రాయి కార్యవర్గంలో సభ్యుడు) తెలియజేశాడు.

సంభాషణలు విఫలంకావడంవల్ల దేశానికి రాజకీయంగా ఎట్టి ఉపద్రవం కలుగదని ఎం. ఎన్. రాయి సంతసం వెలిబుచ్చాడు.

హిందూమహాసభవారి పోకడ

ఇక హిందూమహాసభ నాయకుల విషయం. వీరు గాంధీ - జిన్నా సమావేశం ప్రారంభమైన నాటినుంచీ ఐక్యతకు వ్యతిరేకంగా ఎన్ని చెయ్యాలో అన్నీ చేస్తున్నారు. ఇప్పుడు సమావేశం విఫలమైంది. ఇక వీరి సంతోషానికి హద్దులేదు. రాజాజీ ప్రణాళికను పూర్తిగా పాతిపెట్టేయాలని వీరి సంకల్పం. గాంధీజీ దీన్ని అంగీకరించడంవల్ల దేశానికి ద్రోహంచేశాడని, భారతదేశ ఐక్యతను నాశనం చేయడానికి కాంగ్రెసు కుట్రలు పన్నుతోందనీ, సావర్కార్ ప్రకటించాడు. డాక్టర్ మూంజీ సెప్టెంబరు 29వ తేదీని తిరుచునాపల్లిలో ఉపన్యసిస్తూ, బోల్షివిజం అనే పెనుభూతాన్ని లేవదీశాడు. ముస్లింజాతులు ప్రత్యేక రాజ్యాలుగా ఉంటే, యితర ముస్లిం ప్రభుత్వాలతో చేతులు కలిపి, రష్యాతో స్నేహం చేస్తాయట! అప్పుడు అన్నీ కలిసి హిందుస్తాన్‌మీదికి దూకుతాయట! ఈ ప్రమాదాన్నుండి హిందువులు రక్షించుకోడానికి బ్రిటిష్ ప్రభుత్వంయొక్క సహాయం తీసుకోవాలట! కాబట్టి, హిందూ యువకులకు ఆయుధాలివ్వవలసిందని డాక్టర్ మూంజీ ప్రభుత్వాన్ని హెచ్చరించాడు! ఇప్పుడైనా హిందూ మహాసభ నాయకుల 'అసలు ఉద్దేశం' గ్రహించవలసిందని దేశభక్తుల్ని హెచ్చరిస్తున్నాం. బ్రిటిష్ సామ్రాజ్యం మన దేశంలో చిరస్థాయిగా వర్ధిల్లడమే హిందూమహాసభ ఆశయం; సంపూర్ణస్వాతంత్ర్యంకాదు.

ఈనెల 7, 8 తేదీలలో హిందూమహాసభ నాయకుల అధ్వర్యంక్రింద ఢిల్లీలో "అఖండ హిందుస్తాన" కాన్ఫరెన్సు జరిగింది. దానికి హిందూ సనాతనిస్టులు, ఖరే - జోగేంద్రసింగ్ వంటి వైస్రాయి కార్యవర్గసభ్యులు, ప్రభుత్వంవద్ద సొమ్ము తీసుకుని కార్మికుల్లో ప్రచారంచేసే "ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్" నాయకులు, హాజరయారు. ముస్లిం జాతులకు స్వయంనిర్ణయ హక్కుయిస్తే, దేశం ముక్కచెక్కలౌతుందని తీర్మానాలు చేశారు. అధ్యక్షత వహించిన రాధా కుముదముఖర్జీ తన వాదనను బలపర్చుకోడానికి రష్యా రాజ్యాంగాన్ని సహితం పచ్చి అబద్ధాలతో ఉదహరించుటకు జంకలేదు. వేర్వేరు సోవియట్ రిపబ్లికులకు వేరు విడిపోయే హక్కు, విదేశాంగ వ్యవహారాలపై అధికారం, రక్షణశాఖలపై స్వతంత్రం ఉన్నవనే విషయం దాచిపెట్టాడు.

కాంగ్రెసువాదుల్లో : లీగ్‌వర్గాలలో

ఇదంతా కాంగ్రెసువాదులకు వెగటుగావుంది. గాంధీ-జిన్నా సంప్రతింపులు ఫలించాలని మొదటినుంచీ కాంగ్రెసువాదులు వాంఛించారు. అవి విఫలమైనప్పుడు విచారాన్ని వెలిబుచ్చారు. రాజాజీ ప్రణాళికను ఆధారంగాగొని, ఒడంబడికకు ప్రయత్నించిన గాంధీజీని బలపరిచారు కాని, అందరూ తప్పిదాన్ని జిన్నాగారిమీద వేస్తున్నారు. అయినా, తిరిగి సంప్రతింపులు ప్రారంభంకావాలని కోరుతున్నారు. మనరాష్ట్రంలో ఒక్క "ఆంధ్రపత్రిక", "ప్రజాబంధు" తప్ప తక్కిన జాతీయపత్రికలు సంప్రతింపులు తిరిగి ప్రారంభం కావాలనే కోర్కెను వెల్లడించాయి. "ప్రజాబంధు" అభిప్రాయంలో, జిన్నాగారు యింకా సామ్రాజ్యవాదుల ఏజంటే! "ఆంధ్రపత్రిక" పాకిస్తాన్‌వాదం యింతటితో పూడ్చిపెట్టబడిందని సంతోషించింది!

కాంగ్రెసువాదులవలె ముస్లింలీగర్లుకూడా సంప్రతింపులు విఫలమైనందుకు ఆశాభంగాన్ని వెలిబుచ్చారు. కాని, తప్పంతా గాంధీజీదేనని నిందిస్తున్నారు. ఈవిధంగా కాంగ్రెసువాదులు జిన్నాగారిని, ముస్లింలీగర్లు గాంధీజీని, నిందిస్తున్నారు. కాని, నాయకులిద్దరూ తిరిగి సమావేశం కావాలని లీగర్లు కోరుతున్నారు.

షౌకత్ హయత్‌ఖాన్, హుస్సేన్ ఇమామ్, వంటి లీగ్ నాయకులు, ప్రజల్లో ప్రవేశించి పాకిస్తాన్‌కోర్కె ఎంత న్యాయమైనదో ప్రచారంచెయ్యాలని ప్రకటించారు. పంజాబ్ రాష్ట్ర ముస్లింలీగ్ అధ్యక్ష-కార్యదర్శులు యీక్రింది విధంగా ఒక సంయుక్త ప్రకటన గావించారు:

"పాకిస్తాన్ అంటే అభిమానంవున్న ముస్లిములంతా తమ తమ ఏరియాలలో నివసించే మహమ్మదీయేతర సోదరులను కలుసుకొని, పాకిస్తాన్‌కోర్కె ఎంత న్యాయమైనదో, ప్రజాస్వామ్య సూత్రంపై ఎలాఆధారపడి యున్నదో, ఒప్పించవలసిందని కోరుతున్నాము. ఈకోర్కెను అంగీకరించనిదే భారతదేశ స్వాతంత్ర్యం ఎలా అసాధ్యమోకూడా రుజువు చేయవలసియుంది. .... మన శత్రువులు ఎంతరెచ్చగొట్టినా మనం రెచ్చిపోవద్దు"

తక్షణ కర్తవ్యం

ఈవిధంగా, కాంగ్రెసువాదులు — ముస్లింలీగర్లు సంప్రతింపులు తిరిగిప్రారంభంకావాలనికోరుతున్నారు. కానితప్పంతా జిన్నాదేనని కాంగ్రెసువారు, గాంధీజీదేనని లీగర్లు, భావిస్తున్నారు. మరోవైపు ఐక్యతనువిచ్ఛిన్నంచేసే హిందూమహాసభ ముఠా విషప్రచారంచేస్తోంది. కొందరు కాంగ్రెసునాయకులే యీవలలోపడుతున్నారు. ఉదాహరణకు యు. పి. కాంగ్రెసు నాయకుల్లో కైలాసనాథకట్జూ పలుకుబడిగలవ్యక్తి. ఆయన నిన్న ప్రారంభమైన యు. పి. కాంగ్రెసువాదుల సమావేశంలో జగత్ నారాయణలాల్ తీర్మానాన్ని సమర్థిస్తూ (విడిపోయే హక్కును నిరాకరిస్తూ) ఒకతీర్మానం ప్రవేశపెట్టినట్లువార్తలు వస్తున్నాయి. ఇట్టి తీర్మానాలు యిప్పుడున్న కొద్దిపాటి ఐక్యతనుకూడా విచ్ఛిన్నం చేయడానికే ఉపకరిస్తాయి.

వెంటనే, వివిధరాష్ట్రాలలో బాధ్యతగల కాంగ్రెసువాదులు, ముస్లింలీగర్లు సమావేశాలు జరిపి, గాంధీ - జిన్నా ఉత్తరప్రత్యుత్తరాలలో వ్యక్తమైన విభిన్న దృక్పథాలపై చర్చలు జరిపి, ఒకరి అభిప్రాయాన్ని మరొకరు అర్థంచేసుకుంటూ, ఏకాభిప్రాయానికి రావడానికి ప్రయత్నం చేయాలి. అప్పుడే దేశాన్ని విచ్ఛిన్నతుల బారినుండి కాపాడుకోగలుగుతాం. అప్పుడే ప్రజల్లో తిరిగి ఆశాజ్యోతి వెలుగుతుంది. అప్పుడే సామ్రాజ్యవాదులు, తమ భవనాలలో వెలిగించుకున్న దీపాలు ఆరుతాయి. 9—10—44.

మన నాయకులవెనుక మనం ఇంకా బలవత్తరంగా సంఘటితమము. వారు తిరిగి కలుసుకొని, మనల్ని స్వాతంత్ర్యగమ్యస్థానం చేర్చేందుకు కృషిచేయడమే మనకర్తవ్యం.

అభిప్రాయభేదాలకు మూలకారణం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెసు-లీగులమధ్య ఒడంబడికకు లాహోరు తీర్మానం ప్రాతిపదికగా వుండాలనిజిన్నా కోరాడు. రాయబారాలలో ఐక్యతకు జిన్నా యిలా సూచించాడు:

1. ముస్లిముల సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని గుర్తించాలి. అనగా ప్రత్యేక ప్రభుత్వాన్ని, నిర్మించుకొనే హక్కును గుర్తించాలి.

2. పై హక్కును గుర్తించి కాంగ్రెసు - లీగుల ఐక్యకృషిద్వారా పాకిస్తాన్‌కు, హిందూస్థాన్‌కు స్వాతంత్ర్యం సాధించాలి.

3. రెండు రాజ్యాల నడుమ సరిహద్దుల నిర్ణయం పరస్పరమైన ఒడంబడికద్వారా జరగాలి.

4. రెండు ప్రత్యేక రాజ్యాంగ నిర్మాణ సభలు ఆయా రెండురాజ్యాలకు అవసరమైన రాజ్యాంగచట్టాలను తయారు చేయాలి.

5. రెండు రాజ్యాల మధ్య భావి సంబంధ బాంధవ్యాలు సర్వస్వతంత్రమైన ఆయా రాజ్యాల మధ్య జరిగే ఒడంబడికను బట్టి నిర్ణయమౌతాయి.

కొంచెం ఓపికపట్టి ఆలోచిస్తే, ముస్లిములు కోరే సంపూర్ణ స్వాతంత్ర్యహక్కులో ఉండే వివరాలనన్నిటిని సాకల్యంగా జిన్నాసాహెబ్ చర్చించలేదని తేలుతుంది. ముస్లిములకు సంపూర్ణ స్వాతంత్ర్యం వారి జన్మహక్కు. ఈహక్కు నాధారంగా చేసుకునే జిన్నాసాహెబ్, ముస్లిములు సంపూర్ణాధికారంగల స్వతంత్రరాజ్యాన్ని నిర్మించుకునేహక్కును కోరుతున్నాడు. ప్రత్యేకరాజ్యాంగ నిర్మాణ సభచేత నిర్ణయింపబడే సరిహద్దులలో యీ స్వతంత్రరాజ్యం స్థాపించబడుతుంది. సంపూర్ణ స్వాతంత్ర్యంతో సమాన హోదా ననుభవిస్తూండేముస్లింరాజ్యం, మిగతా భారతదేశంతో ఒడంబడిక చేసుకుంటుంది.

గాంధిజీ - రాజాజీ ప్రణాళిక

కాని ముస్లిములు కోరే స్వాతంత్ర్యం వారి న్యాయమైన హక్కు అనే సిద్ధాంతాన్ని గాంధిజీ అంగీకరించలేకపోయాడు. ముస్లిములు ఒక ప్రత్యేక జాతికి చెందినవారని జిన్నాసాహెబ్ ఉద్రేకపూరితంగా గాంధిజీకి విన్నవించుకున్నాడు. గంటల తరబడి జిన్నాసాహెబ్ చెప్పినదాన్ని ఓపికతో ఆలకించాడు గాంధిజీ. జిన్నాసాహెబ్ ఆదేశంగా తాను విశ్వసించినదాన్ని వాదించినప్పటికీ, గాంధిజీకి దానిలో సబబేమీ కనుపించలేదు. పైపెచ్చు, జిన్నా వాదనను పరిశీలించినమీదట, భావి భారత స్వాతంత్ర్యానికే భంగంవాటిల్లేట్లున్నదని గాంధిజీ భయభ్రాంతుడైనాడు.

ముస్లిములు ప్రత్యేకజాతివారనే వాదనను గాంధీజీ ససేమిరా అని త్రోసిపుచ్చడంవల్ల, వారుకోరే స్వాతంత్ర్యం ముస్లిముల జన్మహక్కనే హంగాన్నిగూడ సహజంగానే గాంధిజీ నిరాకరించాడు స్వాతంత్ర్యం - హిందువులదనీ, ముస్లిములదనీ గాకుండా - యావన్మంది భారతీయుల జన్మహక్కని గాంధిజీ విశ్వాసం.

పాకిస్తాన్‌కోర్కెను స్వాతంత్ర్యాశయంగా పరిగణించక, గాంధిజీ దానిని బలపర్చలేదు. దేశస్వాతంత్ర్యముతో నిమిత్తం లేని ఒక ప్రత్యేకకోర్కెగా గాంధిజీ దాన్నిభావించాడు. విధిలేక అంగీకరించవలసిన కోర్కెగా గుర్తించాడు.

జిన్నా, తాను హృదయపూర్వకంగానమ్మిన దాన్ని అనుసరిస్తాడని గాంధిజీకి స్పష్టమయింది. పాకిస్తాన్ కోర్కె సఫలంగావడానికి, లీగ్ బలవత్తరమైన సంస్థగా తయారయిందనీ, అపూర్వమైన పలుకుబడి సంపాదించుకున్నదనీ, గాంధిజీకి విదితమయింది. ఉదారమైన గాంధిజీ హృదయం, ముస్లింలీగ్ కోర్కెను ఆమోదించేందుకుగాను ఒక పరిష్కార మార్గానికి రమ్మని గాంధిజీని ప్రేరేపించింది దేశానికి పితృసముడుగాఉండి జాతీయోద్యమ నిర్మాతగాను, నాయకుడుగాను అద్వితీయమైన అనుభవాన్ని గడించిన గాంధిజీ, భారతదేశం ఒక గొప్ప కుటుంబమనీ, ఆకుటుంబంలోనుంచి ముస్లింసభ్యుడు విడిపోదలచినపుడు, అలా విడిపోవడం ధర్మమనీ, బలాత్కారంచేత ముస్లిం సోదరుణ్ణి అవిభక్త కుటుంబంలో త్రొక్కివుంచడం సబబుకాదనీ గుర్తించాడు.

ముస్లిముల సంపూర్ణస్వాతంత్రహక్కును గాంధీజీ గుర్తించలేకపోయినా, విడిపోయే హక్కును ఈయడానికి తయారైనాడు ఈవిధంగా లీగ్ తీర్మానసారాంశాన్ని యివ్వవని గాంధీజీ భావించాడు.

ఈ విషయంపైన రాజాజీ, గాంధీగార్ల ప్రణాళికలు రెండూ కూడా గాంధిగారి భావాలకు ఒక స్పష్ట ఆకారాన్ని ఇచ్చాయి.

అవి యివి:

1. భారతీయులందరి స్వాతంత్ర్యసంపాదనార్థం కాంగ్రెసు - లీగులమధ్య సంయుక్త సంఘటన.

2. సంపూర్ణస్వాతంత్ర్య సంపాదనానంతరం, [illegible] - లీగ్ ఒడంబడిక ప్రకారం నిర్ణీతమైన [illegible]భాగాలు విడిపోవాలి.

3. విడిపోయేముందు, ఆ సమస్యపైన సార్వజనికాభిప్రాయాన్ని తీసుకోవాలి.

4. విడిపోయే సందర్భంలో, యిరువురి మధ్య జరిగే సంధి ఒడంబడికలో, విదేశ వ్యవహారాలు, దేశరక్షణ, అంతరంగికరాకపోకమార్గములు, ఎగుమతి దిగుమతి సుంకములు, వ్యాపారము మొదలైన ఉమ్మడి వ్యవహారాలను జయప్రదంగాను, తృప్తికరంగాను నిర్వహించడాన్నిగూర్చి హామీఉండాలి.

అభిప్రాయభేదాలకు మూలకారణం

భారతీయ ప్రజల నాయకశిఖామణులైన గాంధి జిన్నా లిరువురు సంయుక్త సంఘటన సాధించగలమనే వజ్రసంకల్పంతోనే కలుసుకున్నారు. సంభాషణలు 18 రోజులవరకు సాగుతూనేవచ్చాయి. వారిరువురు అన్నట్లుగానే, యిద్దరు నాయకులు యేకమార్గాన నడవకుండా, 'చర్చించినవిషయాన్నే చర్చిస్తూ' యెవరిత్రోవను వారు విడిపోయారు. ఎవరికి వారు భారత స్వాతంత్ర్యానికి తాము చేసిన నిర్వచనానికి అంటిపెట్టుకుని కూర్చున్నారు. ఈ కారణంవల్లనే తాము సాధించదలచుకున్న స్వాతంత్ర్య సంపాదనకై ఒడంబడికకు రాలేకపోయారు. స్వాతంత్ర్యసంపాదనావాంఛ యిద్దరునాయకులను కదల్చివేసింది. అయినా భారతీయులందరిని ఐక్యపరచగల ఒక కార్యక్రమాన్ని యిద్దరూ నిర్ణయించలేకపోయారు. ఇంతకూ యెవరిమట్టుకు వారు తాను పట్టిన కుందేటికి మూడే కాళ్ళంటూ, ఒకరినొకరు అర్థం చేసుకొనక పోవడంవల్లనే, అన్యోన్యంగా భేదాభిప్రాయాలు కలగడం జరిగింది.

పాకిస్తాన్ అంటే ముస్లిములకు స్వాతంత్ర్యంకాదనీ, అది భారతదేశ అనైక్యతకు, విచ్ఛిన్నానికే దారి తీస్తుందనీ గాంధిజీ వాదన.

ఇక జిన్నాసాహెబ్ అభిప్రాయం చూదాం. భారతీయులందరి స్వాతంత్ర్యంకొరకు కాంగ్రెస్ పోరాడడంలేదనీ, బ్రిటిష్ ఆధిపత్యం తొలగగానే; హిందువుల ఆధిపత్యంకొరకే కాంగ్రెస్ ఉద్యమం కృషిచేస్తున్నదనీ జిన్నా గారంటారు. హిందువుల ఆధిపత్యాన్నిగూర్చి జిన్నాగారు భయపడటానికి హేతువేమీలేదనీ, ముస్లిములు కోరే సంపూర్ణస్వాతంత్ర్యహక్కు న్యాయసమ్మతమైనది కాదనీ గాంధీజీ వాదన.

మహమ్మదీయేతరులు అధికసంఖ్యాకులుగా ఉన్న యితర భూభాగాలను ముస్లిములు కబళిస్తారనికూడా గాంధీజీ అనుమానిస్తున్నాడు. పాకిస్తాన్ అంటే గాంధీజీ ఒక విషాదకరమైన శాపంగా భావిస్తున్నాడు; కాని గ్రుడ్డిలో మెల్లగా స్వయంనిర్ణయ హక్కును అంగీకరించాడు. స్వాతంత్ర్య పోరాటానికి జాతీయ సంయుక్త సంఘటన నిర్మించడానికి ముస్లిములనుకూడ తీసుకొని రావడానికి అవసరమని గుర్తించి, స్వయం నిర్ణయహక్కును అంగీకరించాడు. పాకిస్తాన్ ముస్లిముల న్యాయబద్ధమైన కోర్కె అని గాంధీజీ అంగీకరించకపోవడంవల్ల, పాకిస్తాన్ వల్లవచ్చు దుష్ఫలితాలనుండి రక్షించుకోడానికి, తనను (గాంధీజీ) అనుసరించే ప్రజలకు తాననుసరించిన మార్గం సక్రమమైనదని నచ్చజెప్పి తనవెంట తీసుకురావడానికి, చివరకు తాను (గాంధీజీ) ప్రతిపాదించిన సూచనలకు మరికొన్ని సూచనలు గాంధిజీ చేర్చాడు.

ఉదాహరణకు:

1. హిందూ మహమ్మదీయుల స్వాతంత్ర్య సంపాదన నిమిత్తం సంయుక్త సంఘటన కావాలి. భవిష్యత్తులో విడిపోయే హక్కును ఇచ్చేనిమిత్తం, స్వాతంత్ర్యంకొరకు తక్షణం ఐక్యంకావాలి.

2. విడిపోయేహక్కు సార్వజనికఓటింగు ద్వారా ఇపుడు ప్రజలు అంగీకరించినపుడే అమలులోకి వస్తుంది.

నిజంగా ముస్లిములలో యెక్కువమంది విడిపోవడాని కంగీకరిస్తారా అని అత్యధిక సంఖ్యాకులైన కాంగ్రెసువాదులు సందేహిస్తున్నారు.

3. సర్వజనాభిప్రాయంమూలంగా న్యాయసమ్మతమైన సరిహద్దులేవో నిర్ణయం చేయాలి. అధికసంఖ్యాకులైన ముస్లిములువారి మార్గం వారు నిర్ణయించుకుంటే, అల్పసంఖ్యాకులు కూడా వారి అభిప్రాయం ఏమిటో వారు చెబుతారు.

4. హిందూ ముస్లిములయొక్క ఉమ్మడి ప్రయోజనాలను పాలించుకోడానికై ముమ్ముందుగా ఒడంబడిక జరగాలి. సోదరుడు ఒకవేళ అక్రమంగా విభజనేకావాలని కోరితే, భావికాలంలో అతిదెట్టి దుందుడుకు చేష్టలు చెయ్యకుండా హామీ యివ్వాలి.

లీగ్‌కోరే అధికారసారాంశం తానిచ్చినట్లు గాంధిజీ హృదయ పూర్వకంగా విశ్వసిస్తున్నాడు. తన ప్రణాళికను ఆచరణయోగ్యం చేయడానికి, దానిలో కొన్ని షరతులనుచేర్చి దానికొక ఆకారాన్ని, స్వరూపాన్ని కలుగజేశాడు. లాహోర్ తీర్మానంలో విశదీకరింపబడ్డ పాకిస్తాన్ ఆశయ సారాంశాన్నిగూడా గాంధిజీ అంగీకరించలేదని జిన్నాసాహెబు వాదన. దీనికి ప్రతిగా గాంధీజీ చెప్పిందేమంటే, ముస్లిముల కోర్కెను రాజకీయంగా లీగ్‌వర్గేతరులకు గూడా అంగీకారమయ్యేట్టుగా మార్పుదల చేశాడని.

గాంధిజీ సూచించిన షరతులను జిన్నాసాహెబ్ గాఢమైన అనుమానదృష్టితో చూస్తున్నాడు. లీగ్ కోర్కెలోని సారాంశాన్ని యిస్తున్నానని, గాంధిజీ యేవిధంగా నివ్వండేహంగా భావిస్తున్నాడో, అలాగే గాంధీ పెట్టిన షరతులవల్ల లీగ్‌యొక్క ప్రధాన కోర్కెకే భంగం వాటిల్లిందని జిన్నాగారు హృదయపూర్వకంగాభావిస్తున్నారు. ప్రతి ఒక్కషరతు గాంధీజీభావించినదానికి వ్యతిరేకంగా అర్థం యిస్తుంది. సార్వజనిక ఓటింగు అనే పేరుతో గాంధీజీ తనను మోసగింప పూనుకున్నాడని జిన్నాగారి అనుమానం. ఉమ్మడి ప్రయోజనాలను పేర్కొనడంకూడా తిరిగి హిందువుల అధికార ప్రాబల్యాన్ని స్థాపించేందుకేనని జిన్నాసాహెబు భయం.

జిన్నాగారివైపు ఆశాజనకమైన అంశమేమంటే, సంయుక్త సంఘటనయొక్క అవసరాన్ని ఆయన గుర్తించాడు. హిందూస్తాన్, పాకిస్తాన్‌లమధ్య సంధి ఒడంబడికలు జరిగి, సమస్త ప్రజానీకం శాంతి భద్రతల్లోను, అన్యోన్యతతోను జీవించాలని ఆయన వాంఛిస్తున్నాడు. కాని ముస్లిముల స్వాతంత్ర్య హక్కును వెంటనే, నిస్సంకోచంగా, అరమరలు లేక అంగీకరించినప్పుడే [illegible] అంశాలను తూ. చ. తప్పక పాటించగలమని జిన్నాగారంటారు.

పాకిస్తాన్ రాజ్యం సర్వ స్వతంత్రంగా, స్వయంపోషకంగా, శక్తివంతంగా ఉండాలని జిన్నాసాహెబ్ వాంఛ; కాని తన అభీష్టాన్ని ప్రజామోదంతో గాకుండా, కేవలంబేరసారాల ద్వారా సాధిద్దామని ఆయన అభిప్రాయం. ఈ కారణంగా జిన్నాగారు గాంధీజీకి తన వాదనను గురించి నచ్చజెప్పి తన పక్షానికి త్రిప్పుకోలేక పోయారు; పాకిస్తాన్ అంటే గాంధీజీకున్న ద్వేషభావాన్ని అంతంచేయలేకపోయాడు జిన్నాసాహెబ్.

పాకిస్తాన్ ముస్లిముల జన్మహక్కని గాంధీజీ అంగీకరించనందుకు నిజంగా జిన్నాసాహెబ్ ఆవేశ పూరితుడైనాడు.

ముస్లిం ప్రజలకు నాయకాగ్రణి అయిన జిన్నాగారు లాయరుగా వాదించడం మానుకొని, ప్రజా ప్రతినిధిగా వాదిస్తూ, పాకిస్తాన్ రాజ్యం యెలా నిర్మింపబడుతుందో, యెలా నిర్వహింపబడి నడుపబడుతుందో వివరంగా నచ్చజెప్పనంతవరకు, హిందువులుగాని, యితర ప్రజాసామాన్యంగాని ముస్లిముల జన్మహక్కును యెలా గుర్తించగల్గుతారు? పాకిస్తాన్ ప్రజాతంత్ర రాజ్యమనీ, యితర భారతీయులు యేవిధంగా తమ రాజ్యాంగవ్యవహారాలను ప్రజాతంత్ర సిద్ధాంతాలకు బద్ధులై నిర్వహించుకుంటారో, ఆదేవిధంగా తాము కూడా నడుచుకుంటామని నచ్చజెప్పినప్పుడే ముస్లిముల హక్కును మహమ్మదీయేతరులు గుర్తించగలరు. తక్కిన రాజ్యంలో ప్రజల కోర్కెల ననుసరించి వారి ప్రభుత్వం న్యాయబద్ధమైన ప్రజాస్వామ్య సూత్రాలపైయేవిధంగా వ్యవహరిస్తుందో, అదేవిధంగా పాకిస్తాన్ గూడా న్యాయబద్ధంగా వ్యవహరిస్తుందని ప్రజలకు వివరించిచెప్పాలి.

గాంధిజీ గమనించని విషయాలు యివి:

1. పాకిస్తాన్ ఆశయంలోనే ముస్లిముల స్వాతంత్ర్య పిపాస వ్యక్తమవుతోంది.

2 ముస్లింలీగుచేత నడుపబడి, నిర్మాణం గావింపబడ్డ ప్రజా ఉద్యమం ముస్లిముల జాతీయోద్యమం; ఈ ఉద్యమం ముస్లిముల జన్మభూములలో వారి సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు కృషిచేస్తుంది.

3 జిన్నాసాహెబ్ ఏవిషయం చెప్తాడు? ఏ విషయం చెప్పడు? అనేది ప్రధాన సమస్య కాదు; అసలు సంగతేమంటే, భారత స్వాతంత్ర్య పోరాటంలో నాల్గోవంతు ప్రజలైన ముస్లిములను కూడదీసుకొనడం అత్యవసరం.

సూక్ష్మంలో చెప్పాలంటే, పాకిస్తాన్ సామ్రాజ్యవాద వ్యతిరేక స్వాతంత్ర్యోద్యమంగా గాంధిజీ గుర్తించడు. గాంధి-జిన్నాల మధ్య నడచిన ఉత్తర (మిగతా 4 వ పేజీలో)

(3 వ పేజీ తరువాయి) ప్రత్యుత్తరాలవల్ల, యీ హంశాన్ని జిన్నాసాహెబ్ స్పష్టంగా వివరించినట్లు కనుపిస్తున్నది. భారత దేశ స్వాతంత్ర్యాన్ని గురించి గాంధిజీ ప్రధానంగా ఆలోచిస్తూ, ఆ సమస్యయందే నిమగ్నులైనాడు. పాకిస్తాన్ ఉద్యమం ముస్లిముల స్వాతంత్ర్యోద్యమ మనీ, గాంధిజీ మొదలైన కాంగ్రెసు నాయకులు పాకిస్తాన్ కోర్కెను అంగీకరించిన ఉత్తర క్షణమే ఆ ఉద్యమం భారత ప్రజానీకంయొక్క సామ్రాజ్య వ్యతిరేకఉద్యమంలో ఒక అంతర్భాగం కాగలదనీ గాంధిజీకి, ఇతర కాంగ్రెసు వాదులకు నచ్చ చెప్పిననాడు వారు పాకిస్తాన్ కోర్కెను నిష్పాక్షిక బుద్ధితోను, న్యాయబుద్ధితోను విచారిస్తారు.

ఇక జిన్నాసాహెబ్ గుర్తించని విషయాలు యివి :

1. బ్రిటిష్‌ప్రభుత్వం యెన్నటికీ కనికరించి ముస్లిములకు పాకిస్తాన్ ప్రసాదించదు. భారత స్వాతంత్ర్య పోరాటంద్వారానే సంయుక్తంగా కృషిచేసి సాధించుకోవాలి.

2. కాంగ్రెసు ఉద్యమంయొక్క ఆశయం హిందూరాజ్యాన్ని స్థాపించడంకాదు; భారత దేశ స్వాతంత్ర్యమే దాని పరమావధి.

3. పాకిస్తాన్‌కు, సహజమైనబంధుమిత్రులు, అప్తులు హిందూసోదరులు; తన సోదరులను వారి సంస్థను, వారి నాయకుణ్ణి తనమార్గానికి త్రిప్పుకొని, ముస్లిముల ఆశయాలనుగూర్చి వారికి నచ్చచెబుతేతప్ప పాకిస్తాన్ ఆచరణలో నెరవేర్దదు.

జిన్నాసాహెబ్, తను వ్రాసిన వుత్తరంలో హిందూ-ముస్లిం సఖ్యత కుదిరితేనే గాని భారత స్వాతంత్ర్యం లభ్యం కాదని తెలియచేశాడు. కాని ఇది మాటవరసకన్న ముక్క మాత్రమే. పాకిస్తాన్ కోర్కెపైన ఆధారపడి జిన్నాసాహెబు ఒక బలమైన ముస్లిం జాతీయ ప్రజా ఉద్యమాన్ని నిర్మించాడు అయినా, తన పాకిస్తాన్ ఆశయానికి కాంగ్రెస్‌వంటి ప్రధాన రాజకీయ సంస్థయొక్కగాని, దానినాయకుడియొక్కగాని, అసంఖ్యాకమైన కాంగ్రెస్ వాదులు, ప్రచారకులయొక్కగాని ఆమోదాన్ని, సానుభూతిని జిన్నాగారు సంపాదించలేకపోయారు. హిందువులు తమంతట తాము ఉత్సాహకరంగా పాకిస్తాన్ కోర్కెను అంగీకరించడానికి వెనుదీస్తున్నప్పుడు, తన ఆశయాన్ని గురించిచెప్పేదానిలో యేవోముఖ్యలక్షణాలే లోపించియుండియున్నాయన్న విషయం జిన్నాసాహెబ్ మనసుకు తట్టలేదు.

ప్రధాన సమస్య

పరిష్కారమార్గం తేలడానికి, యీసమస్య చాలా చిక్కులతో కూడుకుని వున్నది. దీన్ని గురించి ఒక అభిప్రాయానికి రాకపూర్వం, యింకో మౌలిక సమస్యను పరిశీలిద్దాం: ముస్లిములు ఒక జాతియా లేక భారతదేశం అంతా ఒక జాతియా?

ఇద్దరు నాయకులు యీ సమస్యపైన చాలా తీవ్ర భేదాభిప్రాయాలు ప్రకటించారు; చివరకేదీ తేలలేదు. ఆచరణీయమైన పరిష్కార మార్గానికి రావాలనే అభిప్రాయంతో, సిద్ధాంత సంఘర్షణకు ప్రాముఖ్యతనివ్వకుండా మారంగా నెట్టివేశారు; సహజంగానే యిద్దరూ తమ ప్రయత్నాల్లో విఫలులైనారు. ఉమ్మడి సిద్ధాంతాల పునాదిపైన అన్యోన్యంగా ఒడంబడిక కుదుర్చుకొనకపోతే, కాంగ్రెసు, లీగులు సంయుక్త సంఘటన స్థాపించుకోలేవు.

ముస్లిములు ఒక ప్రత్యేకజాతి అనే సూత్రం గాంధిజీకి తలకాయనొప్పి కల్గిస్తుంది. ముస్లిములు అన్యమతాల్లోనుంచి ముస్లిం మతంలోకి మార్చబడ్డవారని గాంధిజీ అనగానే, ముస్లిం పత్రికలన్నీ ఆగ్రహావేశంతో చిర్రు బుర్రు మని లేచాయి.

భారతదేశం అనేకజాతులకుటుంబం

ఆయన చేసిన లాయరు వాదనలు యిలా వున్నాయి :- ముస్లిములు ఒకజాతి. స్వతంత్రంగా ఉండే హక్కు ప్రతిజాతికీ వుంది. ముస్లింజాతి స్వాతంత్ర్య హక్కే పాకిస్తాను. దానిని అంగీకరించండి. అప్పుడు అందరం సమిష్టిగా భారతస్వాతంత్ర్యం కొరకు కృషి చేదాం.

మతాన్నిబట్టి జాతిని నిర్ణయించడానికి గాంధీజీ పూర్తిగా వ్యతిరేకం. మతం ఒక్కటే జాతికి మూలం అనేవిషయం సరికాదనడంలో గాంధీజీ వాదన సరియైనదే. జాతియొక్క సంస్కృతి, మానసికతత్వం ఏర్పడటంలో మతానికి కూడ కొంతపాత్ర వున్నమాట నిజమే. కాని ఆ వివరాలను యిచట చర్చించ దలచుకోలేదు. ఆ విషయం మరో వ్యాసంలో చర్చించుదాము. భారతముస్లింలు తామంతా ఒకేమతాన్ని అనుసరించుచున్నంత మాత్రాన ఒకజాతి కాదనుమాట మాత్రం వాస్తవం. కాని యింతటితో వదలివేస్తే సగం సత్యం మాత్రమే చెప్పినట్లవుతుంది.

ముస్లిం జాతులు

ముస్లిములు ఒకజాతి అవునా? కాదా? అనే విషయం తేలినంతమాత్రాన సమస్య పరిష్కారం కాదు.

మనదేశంలో సింధీలు, బెలుచీలు, పఠానులు, పశ్చిమ పంజాబీలు, తూర్పుబెంగాలీలు వగైరా ముస్లింప్రజలు వున్నారు. వారికి ప్రత్యేక జాతులకు అవుసరమైన లక్షణాలన్నీ ఉన్నాయి. అనగా :

(1) వారు తమ జన్మభూములలో స్వతంత్రంగా ప్రత్యేక ప్రభుత్వంక్రింద, వుండాలని కోరుతున్నారు.

(2) సాంప్రదాయకంగా వస్తున్న ముస్లిం సంస్కృతితోపాటు వారికి ప్రత్యేకమైన ఒక సంస్కృతి వుంది.

(3) భారతదేశానికి పశ్చిమోత్తర భాగంలోను, ఈశాన్యభాగంలోను వారు ప్రత్యేక ప్రాంతాలలో నివసించుచున్నారు.

ఈ ముస్లింజాతుల జాతీయోద్యమమే పాకిస్తాన్ ఉద్యమం. అయితే గాంధీజీ, కాంగ్రెసు వాదులు ఎందుకు ఈవిషయం అర్థంచేసికోలేక పోతున్నారు? పాకిస్తాన్ కోరేవారు తమవలెనే బ్రిటిషు సామ్రాజ్యవాదుల నుండి స్వాతంత్ర్యంకొరకు పోరాడుతున్న సోదర సైనికులని ఎందుకు వారు గుర్తించడంలేదు?

1920లో భారతముస్లింల ఖిలాఫత్ ఉద్యమాన్ని, కాంగ్రెసువారి జాతీయోద్యమంతో గాంధీజీ మేళవించగలిగారు. సోదర టర్కీ దేశస్థులకు న్యాయం జరగాలనికోరిన భారత ముస్లింల ఉద్యమాన్ని 1920లో గాంధీజీ బలపరచారు. అలాంటపుడు ముస్లిం సోదరులు తమప్రాంతంలో తాము స్వతంత్రంగా ఉంటామని నేడు 1944లో కోరితే గాంధీజీ నిరాకరించగలరా?

1920లో ముస్లింలు భారతస్వాతంత్ర్యోద్యమంలో ఒక భాగంగా ఉన్నారు. అందుచే అపుడు ఖిలాఫత్ ఉద్యమాన్ని అణచడానికి ప్రయత్నించిన బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధీజీ ముస్లిమేతరులను సమీకరించగలిగారు.

1930లో సరిహద్దు రాష్ట్రంలోని ముస్లిం ప్రజలు కాంగ్రెసుకు అండగా నిలచినమాట నిజమే. కాని, దేశం మొత్తంగా చూస్తే 1920 తరువాత ముస్లింలు క్రమంగా కాంగ్రెసుకు దూరం అయారు.

కొంతకాలం చీకట్లో, దారి, తెన్ను గానక నడచినమీదట ముస్లింలు 1935 నుంచి ముస్లింలీగు పునర్నిర్మాణానికి పూనుకున్నారు. ముస్లింప్రజల స్వాతంత్ర్యం కొరకు ఒక ప్రత్యేక జాతీయోద్యమాన్ని నిర్మించారు. నేడు లీగు నాయకులలో సగంమంది ఒకప్పుడు ఖిలాఫత్ నాయకులుగాను, కాంగ్రెసు నాయకులుగాను వున్నవారే!

ఈ విషాదకరపరిస్థితికి కారణం - ముస్లింల ఇబ్బందులను కాంగ్రెసు త్వరగా తీర్చలేకపోవడమే; ముస్లింసోదరుల కోర్కెలను గురించి తగిన బాధ్యత వహించకపోవడమే.

జిన్నా తన కోర్కెలను సరిగా సమర్థించలేక పోయాడని ఆక్షేపించి వూరుకోవడంలో అర్థంలేదు. స్వాతంత్ర్యకాంక్ష, ఎచట వున్నా, ఏ రూపంలో వున్నా గుర్తించాలి. సోదరప్రజల కోర్కెలను అర్థం చేసికోవాలి.

భారతదేశం ఒకేజాతా?

స్వాతంత్ర్యపోరాటమనే అగ్నిలో సానలు తీరి భారతజాతి ఉద్భవింపుతోందని గాంధీజీ విశ్వసించుచున్నారు. ఆ విషయమై ఆయనకు కించిత్ సందేహంకూడ లేదు.

1920నుంచి జిన్నా కాంగ్రెసుకు దూరంగా వున్నాడు. అందుచే స్వాతంత్ర్యపోరాటంలో ప్రజలు చూపిన త్యాగం, వీరగాధలు అతని దృష్టికి గోచరంకావు. ఒకే భారతజాతి అనగానే 19వ శతాబ్దపు సంగతులు జిన్నాకు జ్ఞాపకం వస్తాయి. స్వతంత్ర భారతదేశంలో హిందూమెజారిటీ ముస్లింలను అణచివేస్తుందనే భయం ద్యోతకమవుతుంది.

అయితే, ఒకరు ముస్లింలు ఒకేజాతి అంటున్నారు; మరొకరు భారతదేశం ఒకే జాతి అంటున్నారు; ఇదెలా సాధ్యం? అని మీరు ప్రశ్నించవచ్చు.

అనేకజాతుల కుటుంబం

గాంధీజీ భారతదేశమంతా ఒక కుటుంబమంటున్నారు. మనలో మనకున్న భేదాలను గాంధీజీ గుర్తించకపోవడంలేదు. బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యంకొరకు మనంజరిపే పోరాటంలో అంతా ఒకటేనను విషయాన్ని "భారతదేశం ఒకేజాతి" అనే నినాదం తెలియచేస్తుందన్నాడు.

గాంధీజీ యింకా 'కొంత ముందుకు పోయారు. భారతదేశం అనే కుటుంబంలో వేర్వేరుభాగాలు ఉన్నాయని అంగీకరించాడు. వాస్తవం ఏమంటే భారతదేశం అనేకజాతులు కలిసి నివసించే కుటుంబం.

మనకు ఒక స్వాతంత్ర్యోద్యమం వుంది. అదే జాతీయ కాంగ్రెసు. ముస్లింలకుకూడా ఒక జాతీయోద్యమం వుంది. అదే ముస్లిం లీగు. రెండుఉద్యమాలు బ్రిటిషు సామ్రాజ్యవాదుల పరిపాలనకు వ్యతిరేకమైనవే. రెండూ మన ప్రజల స్వాతంత్ర్యేచ్ఛకు ప్రాతినిద్యం వహించుతున్నాయి.

మనందరి గమ్యస్థానం ఒకటే. ఎంతో కష్టించి సంపాదించబోవు స్వాతంత్ర్యాన్ని అందరం కలసి రక్షించుకోవాలి. మన మాతృభూమిని ఆర్థికంగానూ, సామాజికంగాను పునర్నిర్మాణం చేయడానికి అందరం కృషిచేయాలి.

మనదేశంలోవున్న అన్ని సోదరజాతుల అభివృద్ధికి సంపూర్ణ ఆవకాశాలు వుండాలి. తమిళులు, ఆంధ్రులు, మలయాళీలు, మహారాష్ట్రులు, గుజరాతీలవగైరా హిందూ మెజారిటీవున్న జాతులంతా కలసి ఒక కుటుంబంగా వుండాలని కోరుతున్నాయి. భారత ఫెడరేషనులో సమానహక్కులు, రాష్ట్ర స్వపరిపాలనఅంగీకరించితే చాలంటున్నాయి.

పాకిస్తాన్ ఎందుకుకావాలి?

ఇదేవిధంగా ఇండియాకు పశ్చిమోత్తరంగాను, ఈశాన్యంగాను పఠానులు, పంజాబీలు సింధీలు, బెంగాలీలు వగైరా ముస్లింల మెజారిటీగావున్న జాతులువున్నాయి. అవి ఒక కుటుంబంగా కలసివుండాలని, ప్రత్యేక స్వతంత్ర ప్రభుత్వం కావాలని, కోరుతున్నాయి.

వారు తమ జన్మభూములలో స్వతంత్రప్రభుత్వాలను నిర్మించుకునే హక్కును మనం గుర్తించాలి. ఈహక్కును నిరాకరించడమంటే, స్వాతంత్ర్యాన్నే నిరాకరించడమన్నమాట. భవిష్యత్తులో మన సోదర ప్రజలను తొక్కిపెట్టి పాలించాలని కోరుతున్నామనే ఆరోపణకు గురి అవుతాము.

కాని ముస్లింలు కోరే యీహక్కు ఆచరణలో ఎలా వుంటుంది? ముస్లింల జాతీయోద్యమం విశాలమైన భారతజాతీయోద్యమంతో ఒక ఒడంబడిక చేసికోవాలి. బ్రిటిషుసామ్రాజ్యవాదులతో పోరాడి, స్వాతంత్ర్యం సంపాదించడానికి కాంగ్రెసు-లీగులు కలసిసంయుక్త సంఘటనను నిర్మించాలి.

కాంగ్రెసు-లీగుల ఐకమత్యం రెండు సంస్థల లక్ష్యాలను సాధించడానికికూడా అవసరమే. లేనిచో స్వతంత్ర భారతదేశం ఏర్పడదు; స్వతంత్ర పాకిస్తాన్ ఏర్పడదు.

అందుచే ముస్లిందేశభక్తులు, కాంగ్రెసుగాని బ్రిటిషు ప్రభుత్వంగాని లీగుతో ఒడంబడికకు వాటంతటవే వస్తాయని కూర్చోకూడదు. లీగు కాంగ్రెసుతోకలిసి బ్రిటిషు ప్రభుత్వంతో పోరాడితేనే, వారు కోరే స్వతంత్ర పాకిస్తాన్ వస్తుంది. బ్రిటిషువారు భారతదేశాన్ని చీలిస్తే వచ్చేది స్వతంత్ర పాకిస్తాన్‌కాదు. ప్రజలు మరింత పీడింపబడతారు. నిజమైన పాకిస్తాన్ సాధించడం మరింత కష్టమవుతుంది. ముస్లింప్రాంతాలు ఆర్థికంగా వెనుకబడివున్నాయి. బ్రిటిషు వ్యాపారులు వాటిని మరింత [illegible]. ముస్లింప్రజలు వెనుకబడివున్నారు. వారు మరింత నిర్దాక్షిణ్యంగా దోచుకోబడతారు.

పరస్పర సందేహాలు

కాంగ్రెసువారు లీగుపై తమకున్న అనుమానాలను మరచిపోవాలి. లీగువారు కాంగ్రెసుపై వున్న సందేహాలను పోద్రోలాలి.

పాకిస్తాన్ సూత్రాన్ని ముందుగా అంగీకరించకుండానే లీగు భారతస్వాతంత్ర్య పోరాటంలో కలవాలని కాంగ్రెసువాదులు [illegible] రాదు. పాకిస్తాన్‌లో ముస్లిమేతరులు అణచివేయబడరనీ, పాకిస్తాన్ ప్రభుత్వం హిందూస్థాన్ ప్రభుత్వంతో స్నేహ సంబంధాలు కలిగివుంటుందనీ, ముస్లింలీగుకూడాగ్యారంటీ చేయాలి. అపుడే పాకిస్తాన్‌ను కాంగ్రెసు వాదులు సులభంగా ఒప్పుకుంటారు.

రాజాజీ సూచనలో పాకిస్తాన్‌ను ప్రత్యేక స్వతంత్ర ప్రభుత్వంగా గుర్తించడానికి కొన్ని షరతులు పెట్టారు. ముందుగా ముస్లింలు కోరే పాకిస్తాన్ సూత్రాన్ని ఎట్టి షరతులు లేకుండా గుర్తించవలసింది. తరువాత ఆ సోదరసంస్థనుండి గ్యారంటీలు కోరితే న్యాయంగా వుండేది.

లీగు కోరే ప్రత్యేక స్వతంత్ర ప్రభుత్వాన్ని గాంధీజీ అంగీకరించలేదు. కాబట్టి లీగ్‌వారికి అనేక సందేహాలుండటం సహజమే. అలాగే జిన్నాజీ పాకిస్తాన్ ప్రభుత్వం ప్రజాస్వామిక పద్ధతులపై నడుపబడుతుందని గ్యారంటీ యివ్వ నిరాకరించాడు. అందుచే కాంగ్రెసు వాదులకు అనుమానాలుండటం సహజమే.

ఒడంబడికకు మార్గం

(4 వ పేజీ తరువాయి)

లీగువారు పునరాలోచించుకొని, గాంధీ రాజాజీ సూచనల యెడల తమ దృక్పథాన్ని మార్చుకోవాలి. ఆదేవిధంగా కాంగ్రెసువాదులు లాహోరు పాకిస్తాన్ తీర్మానాన్ని గురించి తిరిగి ఆలోచించి, తమదృక్పథాన్ని మార్చుకోవాలి.

స్వతంత్ర భారతదేశంలో హిందూపెత్తనం వుండదని చెప్పే కాంగ్రెసు వాదనను లీగువారు నమ్మడంలేదు. అలాంటపుడు పాకిస్తాన్ ప్రభుత్వంలో మహమ్మదీయేతరులను అణచమని లీగువారు చెప్పే మాటలను కాంగ్రెసు వాదులు మాత్రం ఎలా నమ్ముతారు? ఆదేవిధంగా పాకిస్తాన్ ప్రభుత్వం హిందూస్థాన్‌తో సోదరభావంతో సహకారం చేస్తుందని కాంగ్రెసువాదులు నమ్మడంలేదు. ఒకవైపున లీగు దేశవిభజన అనే ముఖ్య విషయాన్ని కోరుతూంది. అలాంటపుడు పాకిస్తాన్ పరిపాలన ప్రజాస్వామికంగా వుంటుందని గ్యారంటీచేయాలి.

పరస్పరం చేసుకునే ఒడంబడిక న్యాయ సూత్రాలపై ఆధారపడివుండాలి. అపుడే సందేహాలు, అనుమానాలు తొలగిపోతాయి. ఒడంబడికపై అనేకమంది ప్రజల భవిష్యత్తు ఆధారపడివుంది. అందుచే స్వాతంత్ర్యం, ప్రజాస్వామిక సూత్రాలు ఒడంబడికకు పునాదిగా వుండాలి.

గాంధీ-జిన్నారాయబారాలలో విషాదకరమైన విషయం ఏమంటే, జిన్నాకోరే దిమాండులో స్వాతంత్ర్యం యిమిడివుందని గాంధీజీ గుర్తించలేక పోయాడు గాంధీజీ కోరిన షరతుల వెనకాల ప్రజాస్వామిక సూత్రాలు యిమిడివున్నాయని జిన్నా గ్రహించలేక పోయాడు. మరొకవైపున గాంధీజిన్నాలు యిద్దరూ స్వాతంత్ర్యం, ప్రజాస్వామిక సూత్రాలకొరకే తాము నిలబడుతున్నామని చెప్పుకొంటున్నారు!

ఒడంబడికకు మార్గం

రాజాజీ సూచనలలోని షరతులను లీగు అంగీకరించాలని కోరేముందు కాంగ్రెసు వాదులు ముస్లింలజన్మహక్కునుగుర్తించాలి. లీగువారు ఎట్టిసందేహంలేకుండా రాజాజీ షరతులు న్యాయమైనవని గ్రహించాలి. కాంగ్రెసువాదుల అనుమానాలను తొలగించడానికి, పాకిస్తాన్ సంపాదించడానికి, వాటిని అంగీకరించాలి.

పైవిధంగాఒకవైపున, గాంధిజీ-కాంగ్రెస్ వాదులు, మరొకవైపున జిన్నా-లీగువారు తమ తమ అభిప్రాయాలను మార్చుకోవాలి. లేనిచో కాంగ్రెసు-లీగు ఐకమత్యం త్వరలో సాధ్యం కాదు. ఇపుడు ఎవరికివారు తమ దృక్పథాలను పట్టుకు వ్రేలాడుతున్నారు. పైన నేను సూచించిన మార్గం అనుసరించితే ఏకాభిప్రాయానికి రాగలుగుతారు.

ఆలా ఏర్పడే ఒడంబడిక ప్రకారం :-

స్వాతంత్ర్యం, పాకిస్తాన్‌ల కొరకు కాంగ్రెసు-లీగులు కలసి సంయుక్త ప్రతిఘటన నిర్మించాలి. ఏపార్టీకూడ తనంతటదే ఒంటరిగా బ్రిటిషుప్రభుత్వంతో రాజీపడకూడదు.

లాహోరు లీగుతీర్మానాన్ని అనుసరించి, ముస్లిం జన్మభూములలో స్వతంత్ర ప్రభుత్వాలను ఏర్పరచుకొనేహక్కును ఎట్టి షరతులు లేకుండా గుర్తించాలి.

పాకిస్తాన్ ప్రాంతంలోవుండే ముస్లిములు, ఇతరులు అంతాకలసి — యుక్తవయస్సు వచ్చిన వారందరికి వోట్లతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి పరిషత్తు పాకిస్తాన్ రాజ్యాంగ విధానాన్ని నిర్ణయించాలి.

[దీనిప్రకారం ముస్లిములు తమ ప్రజాప్రతినిధి పరిషత్తును ఏర్పరచుకుంటారు. కాని ఇతరులకు వోటులేకుండా చేయరు. పాకిస్తాన్‌లో ప్రజాస్వామిక విధానం వుంటుంది కాబట్టి కాంగ్రెసువాదుల అనుమానాలు తొలగిపోతాయి; పాకిస్తానే లేకుండా చేస్తారేమోననే భయం ముస్లింలకు తొలగిపోతుంది. దీనివలన కాంగ్రెసుకోరే ప్రజాభిప్రాయం గమనించబడుతుంది; లీగుకోరే ముస్లింజాతుల స్వతంత్ర ప్రభుత్వాధికారం లభించుతుంది.]

పాకిస్తాన్ సరిహద్దులు ఎలా నిర్ణయించాలనే విషయం స్పష్టంచేయాలి. ముస్లింల స్వతంత్ర ప్రభుత్వాధికారం గుర్తించబడాలి. కాని మహమ్మదీయేతరుల హక్కులను తొక్కివేయడంగాని; వారి భూములను లాక్కోడంగాని పనికిరాదు.

ముస్లింలు పూర్తి మెజారిటీగావున్న చోట్ల ప్రజాప్రతినిధి పరిషత్తుద్వారా వారు తమ ప్రభుత్వాన్ని ఏర్పరచుకొనేహక్కు వుంటుంది.

సరిహద్దులను సరిచేయడం విషయం పరస్పర అంగీకారంపై జరగాలి. సోదర ప్రజల మధ్య ఒడంబడిక జరగాలి. (ఈ విషయమై 23-8-44 తేదీ 'ప్రజాశక్తిలో ప్రకటించబడిన వ్యాసంలో బెంగాలు-పంజాబు సరిహద్దులనుగురించి వివరంగాచర్చించబడింది)

దురాక్రమణదారులకు వ్యతిరేకంగా దేశ రక్షణ చేసే విషయమై పాకిస్తాన్—హిందూస్తాన్‌ల మధ్య పరస్పర సహాయక ఒడంబడిక చేసికోవాలి. బ్రిటిషు పరిపాలన ఫలితంగా దేశంలోవ్యాపించిన కరువు, దారిద్ర్యం తొలగించడానికి అవుసరమైన ఆర్థిక పునర్నిర్మాణం విషయమై ఒడంబడిక చేసికోవాలి. మన ప్రజలందరి సంపదను వృద్ధిచేయడానికి పరస్పర సహాయం చేసికోవాలి. పరస్పరంగా నమ్మకం కలగడానికి కాంగ్రెసు-లీగులు యిపుడే ఒడంబడికలు చేసికోవచ్చును. వీటిని తరువాత ఏర్పడే ప్రభుత్వాలచే ఆమోదించబడతాయని వాగ్దానంచేయాలి.

విజ్ఞప్తి

పై సూచనలను సోదర దేశభక్తులందరూ - కాంగ్రెసువాదులు, లీగువారు - చర్చించాలని కమ్యూనిస్టులం కోరుతున్నాము.

ప్రజలలో మాకు సంపూర్ణవిశ్వాసంవుంది. మన ప్రజలలో ఒక భాగానికి స్వాతంత్ర్యం మరోభాగానికి ప్రమాదమవుతుందనే అపనమ్మకము మాకెన్నడూలేదు. ప్రజాస్వామిక విధానంపై ఆధారపడిన స్వాతంత్ర్యంవల్ల వివిధ ప్రజల జాతీయ ప్రతిభ వికసించుతుందని మేము నమ్ముతున్నాము. భారతదేశం స్వతంత్రదేశంగా బలపడి మన కీర్తిప్రతిష్ఠలు పెంపొందుతాయి. దేశం అప్పుడు సుఖసంపదలతో తులతూగుతుంది.

అపవ్యాకులైన కాంగ్రెసువాదులు, లీగు అనుచరులు, పైవిధంగానే కోరుకొన్నారని మాకు తెలుసు. మా సూచనలను జాగ్రత్తగా పరిశీలించి అంగీకరించుతారని ఆశించుతాము. అపుడే కాంగ్రెసు - లీగ్ ఐక్యతను స్థాపించగలుగుతాము.

గాంధీజీ, జిన్నాసాహెబ్‌గార్లు మనప్రజలకు సాటిలేని నాయకులు. వారియెడల మాకు సంపూర్ణ విశ్వాసముంది. వారు పరిస్థితులను యింకా దిగజారనివ్వరని ఆశించుతాము. వారు మళ్ళీ కలసికొంటామన్నారు. రాయబారాలు విఫలమవడానికి కారణమైన సమస్యలపై ప్రజలు తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు.

మనమంతా కృషిచేస్తే, తప్పక కాంగ్రెసు-లీగు ఐకమత్యానికి దారితీయగలుగుతాము. అపుడు గాంధీజీ-జిన్నా సాహెబ్‌లు కలసికొంటారు. ఇద్దరూ కలసి స్వతంత్ర హిందూస్తాన్, స్వతంత్ర పాకిస్తాన్‌లను సాధించి తీరుతారు.

యూరపుకు దాస్యవిముక్తి

నాజీ ఆక్రమిత యూరప్ యావత్తు, నాజీల చెరనుండి విముక్తి అవుతోంది. ఇస్తోనియా పూర్తిగా విముక్తిచెందింది.

ఇస్తోనియా, లాట్వియా, లిథూనియా - ఈమూడు బాల్టిక్ దేశాలు 1940లో సోవియట్ ప్రభుత్వాలు స్థాపించుకొని సోవియట్‌యూనియన్‌తో చేరాయి. సోవియట్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈదేశాలలో ఎంతో అభివృద్ధి జరిగింది. ఉదాహరణకు ఇస్తోనియాలో ఒక్క సంవత్సరంలో 100కి 63 పాళ్ళు పరిశ్రమలు వద్ధిచెందాయి. జమీందార్ల భూములను లాగివేసి ప్రభుత్వ పరం చేశారు. అసలే భూమిలేని 53 వేలమంది బీదరైతులకు భూమి ఈయబడింది. నిరుద్యోగం పూర్తిగా నిర్మూలించబడింది. కాని 1941లో జర్మన్లు ఆక్రమించిన తర్వాత ఈసోవియట్ బాల్టిక్ దేశాలు మూడూ అనేక ఘోరబాధలకు గురి అయ్యాయి. 60 లక్షల ప్రజలుగల ఈ దేశాలలో 8½ లక్షలమందిని నాజీలు చిత్రవధ గావించారు. 10 లక్షల మందిని బానిసలుగా జర్మనీకి తీసుకు పోయారు.

తిరిగి ఈనాడు రెడ్‌ఆర్మీ ఇస్తోనియాకు విముక్తి గల్గించింది. సోవియట్ ఇస్తోనియా ప్రభుత్వం, తిరిగి రైతులభూమిని రైతులకు పంచిపెడుతోంది, ద్రోహులనుశిక్షించుతోంది.

లాట్వియాలోకూడ తుదిపుట్టానికి వచ్చింది యుద్ధం. రీగా విముక్తి త్వరలోనేకానున్నది. లిథూనియాలో పెద్దపెట్టున కొత్తదండయాత్ర ప్రారంభించినట్లు, 2000 ప్రదేశాలను పట్టుకొన్నట్లు నేడు కామ్రేడ్ స్టాలిన్ తన సందేశంలో తెలియచేశాడు. తూర్పు ప్రష్యాను బ్రహ్మాండమైన ఆడకతైరలో పెట్టడానికి, ఉత్తరాన్నుండి ఈ దండయాత్ర ప్రారంభమయినదని తెలిసికోవాలి.

యుగోస్లావియాలోని మార్షల్ "టిటో" దేశభక్త సైన్యాలతో, సోవియటు సైన్యాలు కలిశాయి. యుగోస్లావియారాజధాని బెల్‌గ్రేడ్ వైపుకుపురోగమించుచున్నాయి. బెల్‌గ్రేడ్‌కు 45 మైళ్లలోకి వచ్చాయి. రుమేనియా-హంగేరి సరిహద్దునుకూడా రెడ్‌ఆర్మీ దాటింది. హంగేరిలోకూడా రెడ్‌ఆర్మీ విజయవంతంగాపురోగమించుతూ వుంది.

అల్బేనియాలోకూడ మిత్రసేనలుదిగాయి. ఇంకొకప్రక్క గ్రీసు దీవులలోను, [illegible] భూభాగంపైననూ మిత్రసైన్యాలు [illegible]. ఈ విధంగా బాల్టిక్ - బాల్కన్ దేశాలలో లక్షలకొలది జర్మనుసైన్యాలకు అంతిమఘడియలు సమీపించాయి.

పశ్చిమరంగంలో, ఫ్రెంచి తీరాన [illegible] లాంటి ముఖ్యపట్టణాలు వశమయ్యాయి. ఇందువల్ల, ఇంగ్లీషు కోస్తాకు ఫిరంగిగుండ్ల బాధ తప్పడమేగాక, ఫ్రాంసులోని మిత్రసైన్యాలకు సరఫరాలు సులభమయ్యాయి.

సీగ్‌ఫ్రెడ్ రక్షణశ్రేణిని ప్రక్కగా తప్పుకొని జర్మనీలోకి చొరబడ ప్రయత్నించాయి మిత్రసైన్యాలు. అందుకు ఆర్నహీమ్ (హాలండ్)లో విమానాలద్వారా, దిగిన మిత్రసైన్యాలు విపరీతనష్టాలకు గురియై వెనుదిరిగి రావలసివచ్చింది. కాని అమెరికా ప్రథమసైన్యం అక్టోబరు 1 వ తేదీన ప్రారంభించినదాడి కొంతజయంపొందింది. సీగ్‌ఫ్రెడ్ శ్రేణిని ఛేదించి ఆకెన్ (జర్మనీభూభాగంలో, బెల్జియం సరిహద్దుకు సమీపంగా ఉన్నది) చుట్టూ ఆడకతైరలా కమ్ముకు వస్తున్నది.

కాని ముందున్నది ముసళ్ళపండగ. జర్మనీ నదిగడ్డపై యుద్ధం ముంచుకువస్తోంది అటు తూర్పున, ఇటు పశ్చిమాన ఇంకా పెద్దయెత్తున జర్మనీపై దెబ్బగొట్టడానికి మిత్రసైన్యాలు సిద్ధమౌతున్నాయి. మాస్కో రేడియో 7 వ తేదీన ఇలా ప్రకటించింది.

"తుపానువలె విజృంభించనున్న మా కొత్తదండయాత్రతో, జర్మను రక్షణశ్రేణులన్నీ తునాతునియలౌతాయి. హిట్లరు సైన్యాలకు సంపూర్ణపరాజయం ప్రాప్తించుతుంది."

— తుమ్మల వెంకటరామయ్య

9—10—44

(6 వ పేజీ తరువాయి)

తాళాలతో యువజనులు బయలుదేరారు. కొత్తపేటలో ఊరేగింపు బయలుదేరేసరికి 15 బళ్ళు అయాయి. బళ్ళముందు అనేక విచిత్రవేషాలు, కోలాటం, బుర్రకథలు చెబుతూ ఎక్కడ పదిమందివుంటే అక్కడ ప్రబోధంచేస్తూ వచ్చారు. ఇక ఆ బళ్ళలో వారెవ్వరు?

అదుగో! గాంది జిన్నాలు కరస్పర్శ చేసికొంటూ, భారతమాత సంకెళ్ళను బ్రద్దలు గొట్టడానికి బయలుదేరారు. ఇంకొకప్రక్క గాంధీ - జిన్నాల 'ఐక్యతానౌక'లో ప్రయాణం చేస్తున్నారు. ఎప్పుడు ఐక్యతవస్తుందా, భారతదేశానికి యెన్నడు మోక్షంగల్గుతుందా అని ఉవ్విళ్లూరే ఆ ప్రజానీకం, ఆనాడు కనిన మధురస్వప్నాలన్నీ, నేడు విఫలం అయ్యాయి గదా అని ఎంతో విచారిస్తోంది.

మరోప్రక్క నరభక్షకుడు హిట్లరు. ఇంకో చోట, ఆక్రమిత ప్రజలనే మార్కండేయుని హిట్లరనే యముడిపాశంనుండి రక్షిస్తున్న స్టాలిన్ అనే శివుడు శూలంతో ప్రత్యక్షమవుతున్నాడు. ఇంకోప్రక్క హిట్లరు, ముసోలినీ, టోజోలతో (బుట్టబొమ్మలను) యుద్ధం చేస్తున్న స్టాలిన్ వగైరాలు.

ఇంతేగాదు. తిండిదొంగ, కంట్రోలుదరకు మించి ఎలా దొంగవ్యాపారం చేస్తున్నాడో; ఇలాంటి తిండి దొంగలవల్ల బెంగాలులో గల్గిన కరువు బీభత్సమూ, కొన్ని దృశ్యాలలో చూపబడింది. ఇలా జాతీయ అంతర్జాతీయాలకు సంబంధించిన వేషాలేగాక, త్రాగుడువల్ల అనర్థకం, విద్యయొక్క అవసరం మొదలగునవికూడా వేషాలద్వారా ప్రబోధించబడింది.

ఈ బళ్ళన్నీ ఊరంతాతిరిగి గవర్నరుపేట చేరేసరికి 5 గంటలయింది.

ఇలాంటి రాజకీయ పరిజ్ఞానాన్ని కల్గించే కన్నులపండువ దృశ్యాలను బెజవాడ ప్రజలిదివరకెన్నడూ ఎరుగరు. బెజవాడ ప్రజలేగాదు, ఆంధ్రప్రజానీకమే ఎరుగదంటే అతిశయోక్తికాదు.

నెల్లూరు జిల్లా

ఇనాంరైతుల మహాసభ

21-10-44 సా॥ 5 గంటలకు

నెల్లూరు టౌనుహాలులో

మహాసభాధ్యక్షులు :

శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు

★ గాంధీ జయంతి

ఊరూరా సభలు, ఊరేగింపులు

అక్టోబరు 2 వ తేదీ గాంధీజీ జన్మించిన రోజు. భారతీయులందరికీ అదొక పర్వదినం. అనాడు యావద్భారత దేశం గాంధీజీకి జోహారు లిస్తారు.

24 సంవత్సరాలక్రితం గాంధీజీ భారత జాతీయోద్యమాన్ని బ్రహ్మాండమైన ఒకప్రజా ఉద్యమంగా మార్చారు. ప్రజాబలంతో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారు. ప్రజా ఐక్యతతో స్వాతంత్ర్య సంపాదన ఎలా సాధ్యమో చూపించారు. దానిప్రవృత్తిలో ప్రస్ఫుటూన్న ప్రజల్లోనుంచి లక్షలాది యోధుల్ని తయారుచేశారు.

అట్టి నాయకుని జన్మదినోత్సవం ఆసేతు హిమాచల పర్యంతం కన్నుల పండువుగా జరుగుతుంది. మహాత్ముని ఆశయసిద్ధికి ప్రజలంతా దీక్షపూనుతారు.

గాంధీజీ జీవితంలో 75 సంవత్సరాలు పూర్తయాయి. భారత స్వాతంత్ర్య సంపాదనకై తన యావజ్జీవితాన్ని ధారపోస్తూన్న ప్రజానాయకునికి ఆంధ్రదేశమంతా మొన్న 2 వ తేదీని అంజలి సర్పించింది.

"స్వాతంత్ర్య వీరుడవు ఓగాంధీ
సత్యమూర్తివయ్యా ఓగాంధీ
నీ జన్మదినమిది ఓగాంధీ
మాకు పండుగరోజు ఓగాంధీ"

అని పాడుకుంటూ, ఉప్పుగుండూరు (గుంటూరు)లోయువకులుఉదయాన్నే ప్రభాత భేరీలు మ్రోగించారు సాయంత్రం 4 గంటలకు నాలుగుచక్రాల రథాన్ని పెద్ద గాంధీ చిత్రంతో అలంకరించి, ప్రక్కన భారత మాత, నెహ్రూ పటాలను ఉంచారు. ముందుగా మూడు వరుసలలో వందలకొద్దీ యువకులు జాతీయ జండాలు, ఎర్రజండాలు, "స్వాతంత్ర్యం - శాంతి - అభ్యుదయం" అని వ్రాయబడ్డ జండాలు, ధరించి

"ఆనందమానందమాయెనుగా
మన గాంధికి దీర్ఘాయువౌనుగా"

అని పాడుకుంటూ నడిచారు తరువాత కొత్తదుస్తులతో బాలబాలికలు

"బోసినోటితాత హాయిగా
వేయేండ్లు వర్ధిల్లుతాడుగా"

అని ముద్దుపాటలతో వెంబడించారు. తరువాత మేళతాళాలు: ఆ తరువాత రథం. రథం వెనక ప్రజాసామాన్యం ఒక మహాప్రవాహం వలె ముందుకు సాగింది. "గాంధీకి జై" అనే నినాదాలతో గ్రామమంతా ప్రతిధ్వనించింది. నాలుగువీధులూకలిసే ప్రతికేంద్రంలోను రాజకీయ ప్రబోధం గావించే విచిత్ర వేషాలు, భజనలు, కోలాటాలు, డ్యాన్సులు! రాత్రి పెద్ద బహిరంగసభ. సభలో గాంధీజీ జీవిత సంగ్రహాన్నిగూర్చి పలువురు ఉపన్యసించారు.

గుడ్లవల్లేరులో(కృష్ణా)స్థానిక కాంగ్రెసువాదులు కమ్యూనిస్టులుకలిసి, గాంధీజయంతిజరిపారు. 75 జతల యెడ్ల బండిపై గాంధీజీ పటాన్ని ఊరేగించారు. సాయంత్రం 6 గంటలకు డాక్టరు ముదునూరు గుర్రాజుగారి (కాంగ్రెసు) అధ్యక్షతక్రింద బహిరంగసభ జరిగింది. కామ్రేడ్ తమ్మారెడ్డి కృష్ణమూర్తి (కమ్యూనిస్టు). శ్రీ కోట రంగారావుగారు (కాంగ్రెసు) గాంధీజీ దేశానికిచ్చిన సందేశంపై ఉపన్యసించారు.

ఇలాగే తైకలూరు, చౌటపల్లి గ్రామాలలో కూడా కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులు అన్యోన్యసహకారంతో గాంధీ జయంతి జరిపారు.

హిందూ-ముస్లిం ఐక్యతకై గాంధీజీచేసిన, చేస్తూన్న కృషి యావద్భారత దేశాన్ని ఉర్రూతలూగించింది. ముఖ్యంగా ముస్లిం ప్రజలుకోరే స్వయంనిర్ణయ సూత్రాన్ని గాంధీజీ అంగీకరించడం, లీగ్ నాయకునితో సంప్రతింపులద్వారా ఒడంబడికకు తీవ్రప్రయత్నంగావించడం, చూచాం. అయితే, సంప్రతింపులు విఫలం కావడంవల్ల తిరిగి నిరాశ, నిరుత్సాహం దేశంలో వ్యాపించింది. కాని: గాంధీ జయంతినాడు జరిగిన ప్రతి సభలోనూ ఉపన్యాసకులు నిరుత్సాహపడవలసిన అవసరంలేదనీ, సంప్రతింపులు తిరిగి ప్రారంభం కావలసియున్నవనీ తెలియజేశారు. బాపట్ల పట్టణంలో జరిగిన బహిరంగసభకు పట్టణ కాంగ్రెసు నాయకులలో ఒకరైన శ్రీ వేదాంతం వాసుదేవరావుగారు అధ్యక్షతవహిస్తూ, యిలా ఉపన్యసించారు:

"మనం నిరుత్సాహపడవలసిన అవసరంలేదు. ఇద్దరూ తిరిగి కలుసుకొని ఒక నిర్ణయానికి రాగలందులకు కృషిచేదాం!" చిలకలూరిపేటలో జరిగిన సభలో, శ్రీ తోట శీనయ్యగారు (కాంగ్రెసు) కాంగ్రెసు-లీగ్ ఐక్యతకై కమ్యూనిస్టుపార్టీచేసే కృషిని ప్రశంసించారు. తెనాలిలో కమ్యూనిస్టుపార్టీ, తాలూకా రైతుసంఘాల యాజమాన్యాన జరిగిన సభకు దాదాపు 1200 మంది ప్రజలు హాజరయారు. పండిత మదనమోహన విద్యాసాగర్ (ఆర్యసమాజ్)గారు అధ్యక్షత వహించారు.

"ఐకమత్యం లేనిదే స్వాతంత్ర్యం రాదు: బ్రిటిష్ ప్రభుత్వం నేడు మనలో మనకుగల అనైక్యతపైనే ఆధారపడుతోంది!" అంటూ రేపల్లె సభలో ప్రముఖకాంగ్రెసువాది శ్రీ రావు వెంకట రాయణంగారు ఉపన్యసించారు. హిందూ - ముస్లిం ఐక్యతయొక్క అవసరాన్ని వివరించారు.

వెల్లటూరు, పల్లెకోన గ్రామాలలో జరిగిన బహిరంగ సభలకు తాలూకా కాంగ్రెసునాయకులు (తంగిరాల విచ్చయ్యశాస్త్రి, యార్లగడ్డ శేషయ్యగారలు) అధ్యక్షత వహించగా, కమ్యూనిస్టులు జాతీయైక్యతయొక్క అవసరాన్ని గురించి, గాంధీజీ అందుకై గావించే కృషిని గురించి, ఉపన్యసించారు.

ముస్లిం ప్రజల పాకిస్తాన్ కోరిక న్యాయమైన ప్రజాస్వామిక కోరిక. ఆకోర్కెను ఎట్టి షరతులు లేకుండా అంగీకరించడం కాంగ్రెస్ వాదుల ధర్మం. ఏహక్కుకై తాము గత 25 సంవత్సరాలనుండి బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడు తున్నారో, ఆహక్కునే ముస్లిం ప్రజలకుకూడా వర్తింపచేయాలి. అప్పుడే కాంగ్రెసు - లీగ్‌లమధ్య సమరసభావం సోదరత్వం, కలుగుతాయి. అప్పుడే యీరెండు సంస్థల మధ్య ఒడంబడికజరిగి, సామ్రాజ్యవాదుల్ని గడగడ లాడించ గల్గుతాం. ఈ విషయం పై సభలలో కమ్యూనిస్టుపార్టీ సభ్యులు స్పష్టీకరించారు.

నెల్లూరు జిల్లాలో ఇందుకూరుపేట, కోవూరు, వెంకటగిరి, ఉటుకూరు గ్రామాలలో స్థానిక కాంగ్రెసువాదుల సహకారంతో జరిగిన బహిరంగసభలో వేలకొద్దీ ప్రజలు యీఐక్యతా సందేశాన్ని విన్నారు. కోవూరు సభలో శ్రీ ముత్తరాజు గోపాలరావుగారు, గండవరపు హనుమారెడ్డిగారు, ఓరుగంటి సుబ్రహ్మణ్యంగారు మన్నేపల్లి హనుమంతరావుగారు, ఉపన్యాసాలిచ్చారు. వెంకటగిరిలో శ్రీ కముత షణ్ముఖం (కాంగ్రెసు ఎం. ఎల్. ఎ.)గారు గాంధీజీయొక్క స్వాతంత్ర్యసందేశాన్ని తెలియజేశారు.

ఈ విధంగా గాంధీ జయంతినాడు రాష్ట్రమంతటా హిందూ-ముస్లిం ఐక్యతకై ప్రజావాంఛ ప్రస్ఫుటమయింది. గాంధీ - జిన్నాల మధ్య తిరిగి సంప్రతింపులు ప్రారంభం కావాలని అంతా ఎదురుచూస్తున్నారు. ఈ ఆశ త్వరలో ఫలించినట్లు ఆందోళనచేయాలి.

దసరాపండుగలో యువజనులు తెచ్చినమార్పు

"జయీభవ, విజయీభవ, దిగ్విజయీభవ" అనుకొంటూ బాలబాలికలు అనేక గ్రామాల్లో గుమ్మాలను దు ప్రత్యక్షమయ్యారు. అయితే "ధరసింహాసనమై. నభంబు గొడుగై!" అనే పాతపద్యాలు రాలేదు వారి నోటివెంట. "అయ్యవారికిచాలు అయిదు వరహాలు. పిల్లవాళ్ళకుచాలు పప్పుబెల్లాలు" అనే పాటలూ వినబడలేదు. పప్పుబెల్లాల కోసం, అయ్యవార్ల (పంతుళ్ళ) వెంబడిపడి, కాలికి బలపం కట్టుకొని యిళ్ళు యిళ్ళు తిరిగే రోజులు పోయాయి. ఇప్పుడు దసరా పట్టడమే అదివయిపోయింది. మరి, అప్పుడు ఈ బాలసంఘాలిలా ఎందుకువచ్చాయి?

బెంగాల్, విశాఖ, రాయలసీమ జిల్లాలలో కరువు వారి లేతహృదయాలను కదిల్చివేసింది. సోవియటు రష్యాలో నాజీలు పనిపాపలపై చేసిన ఘోరకృత్యాలకు వాళ్ళ రక్తం ఉడుకెత్తిపోయింది. సోవియటు బాలబాలికల వీరకృత్యాలు, స్వాతంత్ర్య పిపాసులయిన మన కిశోరహృదయాలను ఉప్పొంగించాయి.

అందుకనే వాళ్ళ యువజన సంఘాల ఆదేశానుసారంగా, దసరా రోజులలో కరువు పాటలు, టాన్యా, మాన్యా, మొదలగు సోవియటు బాలబాలికల వీరగాథలు దసరాపాటల రూపంలో పాడారు. దసరాలో వసూలుచేసిన ధనాన్ని, బెంగాలుకు, విశాఖజిల్లాకు, కస్తూరిబానిధికి పంపారు. కొందరు తమ బాలసంఘాలకు పంపు వసూలుచేశారు

తెలగాయపాలెం (గుంటూరుజిల్లా) బాలబాలికలు తమకు వచ్చిన కొబ్బరికాయలను గూడా తినకుండా వాటిని అమ్మి కస్తూరిబానిధికి పంపారు సరసాయపాలెం (గుంటూరు జిల్లా) బాలబాలికలు రు 57-0-0 కస్తూరిబానిధికి వసూలు చేయగల్గారంటే ఆశ్చర్య పడాలిసివస్తోంది! బొండపాడు, (కృష్ణాజిల్లా) బాలసంఘం తమ సంఘానికి రు. 25-0-0 ప్రోగుచేసుకొన్నారు.

ఈవిధంగా దసరాకు, ప్రజోపకరమైన దేశోపకరమైన పనులకు పూనుకొన్నాయి బాలసంఘాలు దసరా పండుగకు కొత్త సాంప్రదాయాలను నెలకొల్పాయి.

పండుగలలో ప్రభాత భేరీలు ఊరేగింపులు, ఆటలపాటల పోటీలు, ఉపన్యాస పోటీలు - మొదలైన కార్యకలాపాలతో బాల సంఘాలు దసరాపండుగను మహోత్సాహంగా గడిపాయి. అన్నిటికన్న "గాంధీ - జిన్నాలకు జై" అన్న వారి నినాదం గమనించ వలసినదిగా వుంది.

బాలబాలికల భావిజీవితాన్ని సరిదిద్దాలంటే వారికన్న పెద్దలు - ముఖ్యంగా యువకులు, ఆదర్శప్రాయంగా వుండాలి. ఈనాటి యువజన సంఘాలు అలా ఆదర్శప్రాయంగా పనిచేస్తూ, బాలసంఘాల క్రమపద్ధతిని నడపడానికి చేయూతనిస్తున్నాయి. ఈ యువజన సంఘాలు నేడు దసరాపండుగ వాతావరణాన్నే మార్చివేశాయి.

ఇదివరకు దసరాపండుగలకు పిల్లల కోలాహలంగాక, బిచ్చగాళ్ల కొన్ని విచిత్ర వేషాలు వేస్తూండేవాళ్లు. కాని ఈనాడు సమాజ సంస్కారానికి దేశాభ్యుదయానికి అవసరమైన వైజ్ఞానిక ప్రదర్శనాలద్వారా యువజనులు ప్రజల చైతన్యాన్ని హెచ్చింపు తున్నారు. విచిత్రవేషాలు, బుర్రకథలు, హరికథలు, నాటకాలు మొదలైన వాటి ద్వారా నేటి సమాజ పరిస్థితినీ, దేశంలోని రాజకీయ వాతావరణాన్ని ప్రజలకు నచ్చచెప్పి, వారిని కర్తవ్యోన్ముఖులుగా చేస్తున్నారు.

రాయలసీమలో గడేపోతూరు అనే గ్రామం వుంది. మామూలుగా జరిగే శమీ (జమ్మి) వృక్ష పూజకుతోడు, గాంధీ - జిన్నాల పటాలతో ఊరేగింపుకూడా జరిగింది. ఇలాగే ఎన్నోచోట్ల నాయకుల పటాల ఊరేగింపు జరిగింది. ఇంతకన్నా ప్రాముఖ్యమైన విషయం మరొకటి ఉంది.

నెల్లూరుజిల్లాలో, దసరా వేషాలు హిందూ ముస్లిం తగాదాలకు పూర్వం కారణమయ్యాయి. కాని నేడో! నెల్లూరుజిల్లా ఇందుకూరుపేటలో హిందూ-ముస్లిం ఐక్యతా నినాదంతో ఊరేగింపు జరిగింది. గాంధీ జిన్నాల చిత్రపటాలతో ఊరేగింపు జరిగింది. కరువుకాటకాలు-జాతిసత్వం-ఫాసిజం - అనే రాక్షసులను జయించ శపథం పూనడమే, ఈవిజయదశమినాడు మనం చేయవలసిన కర్తవ్యం అంటూ ఉపన్యాసకులు 1000 మంది ప్రజలను ఉద్బోధించారు.

పశ్చిమగోదావరిజిల్లా లింగబోయిచర్ల యువజనుల కృషికి సంతోషిస్తూ, ఒక స్థానికోపాధ్యాయుడు "మేము 25 సంవత్సరాలుగా ఏర్పాటు చేయాలని విఫలంజెందిన గ్రంథాలయాన్ని మీరు ఏర్పరచ గలిగారు, ఒక్క సంవత్సరంలోనే. యువకులను త్రాగుడు, జూదం, పేకాట, కోడిపందాలు మొదలగు దుర్వ్యసనాలనుండి మరల్చగలిగారంటే, మీనిర్మాణ శక్తిని మెచ్చుకోకుండా ఎవరుండగలరు." అని ఆదసరా వుత్సవ సందర్భంలో ఆశీస్సు లిచ్చారు.

యావదాంధ్రలోకంలోకి బెజవాడ దసరా ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిగాయి. నవరాత్రులలో రోజూ ఏదో ఒక ప్రదర్శనతో యువజనులు ప్రజలను రంజింపచేశారు, "ప్రతిమ", "పరిష్కారం", "హరిజన" మొదలగు నేటి రాజకీయ సాంఘిక వాతావరణాన్ని తెలిపేనాటకాలను ప్రదర్శించారు. ఇంకా బుర్రకథలు, హరికథలకు కొదువేలేదు.

24 వ తేదీరాత్రి, కొత్తపేటలో ప్రజా సంరంభం. 20 వేలకుపైగా ప్రేక్షకులు. ఏ తిరునాళ్ళకూ ఇంతజనం ప్రోగవ్వరు. కొంతమంది జనం రావిడికి తాళలేక, ఆబొమ్మల 'దర్శనం'గాక తిరిగి వెళ్ళిపోయినవారున్నారు పాపం. ఏమి జరిగిందక్కడ?

ప్రతి పేటనుండీ ఒక్కొక్క బండిపై వేషాలువేసికొని మేళ (మిగతా 5 వ పేజీలో)

★ రైతు కాంగ్రెసు వాదులతో

సంప్రతింపు లెందుకు భగ్నమయాయి?

రాష్ట్ర రైతుసంఘనాయకుల జవాబు

[illegible] ఉద్యమంలో ఐక్య [illegible] మేము శ్రీ భారతీదేవి ప్రభృతులతో జరిపిన సంభాషణ లనుగూర్చి 8-10-44 తేదీ "ఆంధ్రపత్రిక"లో వచ్చిన ప్రకటనలో కొన్ని సత్యదూరములగు [illegible] యుండుటచే వాస్తవమును ప్రకటించవలసిన ఆవశ్యకత మాపై నున్నది.

ప్రస్తుతపరిస్థితులలో రెండుసంఘాలనూ కలిపి పనిచేయవలసిన అవసరం [illegible] భావించాము. ప్రతిష్టంభనా నివారణ [illegible] కాంగ్రెసు - లీగు ఐక్యతకొరకూ గాంధీజీచేసే ప్రయత్నాలను బలపర్చడం, విశాఖ కరువు నివారణకై పనిచేయటం, ఈనాటి రైతుల హక్కులను సాధించటం, ఆహారసమస్యను పరిష్కరించటం, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు మొదలగువాటిని సక్రమంగా అందచేయటం మున్నగు ప్రధాన సమస్యలపై రెండుసంఘాలనూ కలిపి పనిచేసినచో, రైతాంగమునకు ఎక్కువ సేవచేయగలమను ఉద్దేశముతోనే మేము ఈ సంభాషణలను ప్రారంభించాము.

ముందుగా "ఆంధ్రపత్రిక" రిపోర్టులోని రెండు అసత్యాలనుగూర్చి తెలియజేయాలి. "1942జాతీయోద్యమాన్ని అఖిలభారతకిసాన్ సభఖండించుటచే రంగాగారు అందులోంచి చీలిపోయారనీ: "కమ్యూనిస్టులు పోటీగా మరొక రైతుసంఘాన్ని పెట్టారనీ" ఈ రిపోర్టరువ్రాశారు. [illegible] కూడా భారతీదేవి ప్రభృతులు ఈ విషయాన్ని [illegible]. కాబట్టి నిజాన్ని తెలియజేయవలసివుంది.

1942 సెప్టెంబరులో సెంట్రల్ కిసాన్ కౌన్సిలు బొంబాయిలో సమావేశమై రాజకీయ పరిస్థితులపై ఒక [illegible] అందులో విధ్వంసకచర్యలు కాంగ్రెసు ప్రారంభించిన పోరాటంకాదనీ, ప్రభుత్వ [illegible] నిర్బంధ విధానానికి ప్రతిక్రియగా ప్రజలు కోపోద్రేకంతో చేసినవనీ అట్టి విధ్వంసక చర్యలు పంచఘాంగదశానికి ఉపయోగపడవు తాయనీ, ప్రభుత్వ నిర్బంధ విధానానికి దోహదమిస్తాయనీ, దేశరక్షణలకు భంగం కలిగిస్తాయనీ, స్పష్టంచేశారు. కాబట్టి అట్టి విధ్వంసకచర్యలలో ప్రజలెవ్వరూ పాల్గొనక, కాంగ్రెసునాయకుల విడుదలకొరకూ, జాతీయైక్యతకొరకూ కృషిచేయమని కిసాన్ కౌన్సిల్ హెచ్చరించింది. అఖిలభారతకిసాన్ సభయొక్క యీదృక్పథమే సరియైనదని తర్వాత జరిగిన ఘటనలు రుజువుచేశాయి.

కాంగ్రెసుమరూపుమాప పథకట్టిన ఆమెరీ 1942 విధ్వంసకచర్యలు కాంగ్రెసు నడిపిన పోరాటమే వంటాడు. గాంధీజీ తాము పోరాటాన్నే ప్రారంభించలేదనీ, విధ్వంసక చర్యలకు కాంగ్రెసుకు బాధ్యతలేదనీ స్పష్టం చేశారు. అయినా భారతీదేవిప్రభృతులు 1942 విధ్వంసక చర్యలను ఇంకా జాతీయ పోరాటమంటూ రావటం అమెరీ వాదనను బలపర్చటం కాదా? గాంధీజీయొక్క సిద్ధాయితిని శంకించటం గాదా? జైలునుండి బయటకు రాగానే గాంధీజీ చెప్పిన విషయాన్నే అఖిల భారత కిసాన్‌సభ 1942లోనే చెప్పుతే, అది వీరి దృష్టిలో జాతీయ విద్రోహమయింది.

ఈపై దృక్పథంతో వుండుటవల్లనే భారతీదేవి ప్రభృతులు ప్రస్తుత రాజకీయ కర్తవ్యాలనుగూర్చి శ్రద్ధగైకొన్నట్లు మాకు కనుపించలేదు. గాంధీజీ కాంగ్రెసు-లీగు ఐక్యతకై గావించే ప్రయత్నాలను ప్రతి దేశభక్తుడూ బలపరుస్తూ వాటిపెంపుకు ప్రజాబలమును సమకూర్చుటకై ఎడతెగని కృషిని గావించాలి, కాని వీరు వాదసౌలభ్యం కొరకు గాంధీజీని బలపరుస్తున్నారేగాని, వారిదృక్పథంలో వాస్తవంగా మార్పువచ్చినట్లు మాకు గోచరించలేదు. అందుచే ప్రస్తుత రాజకీయ కర్తవ్యంపై

కూడా కలిసి పనిచేసే అవకాశం కల్గలేదు. కమ్యూనిస్టులు పోటీ రైతుసంఘాలను పెట్టారన్నది అసత్యం. పోటీ సంఘాలను పెట్టింది భారతీదేవిగారు, లక్ష్మీనారాయణగారు వగైరాలే. 1943లో అఖిలభారత కిసాన్‌సభనుండి విడిపోవుటేగాక, రైతుసంఘాలను చీల్చడానికి ప్రయత్నించింది. దీనిని రైతువుద్యమ ద్రోహముగా యెంచి ఏజిల్లా రైతుసంఘమూ దీనిని అంగీకరించక, మామూలుగా పనిచేస్తూనే వున్నాయి. నూతన సభ్యత్వం చేర్పించినా, ఎమ్మట రాష్ట్రసంఘం ఎన్నుకొబడ్డది లోగడ రాష్ట్ర సంఘ కార్యవర్గసభ్యులు గానో, జిల్లాసంఘాల అధ్యక్ష కార్యదర్శులు గానో వుంటూవున్న కాటకొండ నరసింహారెడ్డి, ముత్యాలమల నాగభూషణం, పేచేటి వెంకటలక్ష్మం, ఐపాద్రెడ్డి శంకరయ్య, వగైరాలు ఈకమిటీలో వున్నారు. ఈసంఘాలు మామూలుగా పనిచేస్తూ వుండగా, అతిక్లిష్ట దశలో రైతుసంఘాలను విడనాడిపోయిన భారతీదేవి ప్రభృతులు, వీటికిపోటీగా సంఘాలుపెట్టసాగారు. ఇది విజస్థితి.

ప్రస్తుతం రైతుల నెదుర్కొనే అనేక ప్రధానసమస్యలనుగూడా, రాజకీయసమస్యను నిర్లక్ష్యపరిచినట్లే నిర్లక్ష్యపరుస్తున్నారు. ఆహారసమస్యా పరిష్కారానికై ధరల కంట్రోలు, రేషనింగు, ధాన్యసేకరణము మొదలగు వాటిని మాటవరసకై అంగీకరిస్తారేగాని, ఆచరణలో పూర్తిగా వ్యతిరేకమైన కార్యక్రమాన్ని అవలంబిస్తున్నారు. ధాన్యం ధరల విషయమై మూడు చిత్రమైన కారణాలు చూపించారు.

1. ఇతరసరుకుల ధరలతోబాటు ధాన్యం ధరపెరగాలి.

2. బియ్యంధర పెంచి అయినా వడ్లధర పెంచాలి.

3. బియ్యం దొంగమార్కెటులో హెచ్చు ధరల కమ్మబడుతోవుంది గనుక మనం వడ్లకు హెచ్చు ధరలు కోరాలి.

నిజంగా దేశాన్ని, రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని కోరే కోర్కెలు కావివి. ప్రజలలో 100 కి 100మందికి కావలసిన ధాన్యంయొక్క ధరలు ఇతర సరుకుల ధరలవల్లె ఉవ్వెత్తుగా పైకి లేచిపోవుట అసాధ్యమనీ, ఒక పరిమితిని మించిపెరిగితే, ప్రజలుకరువువాత బడుదురనీ ప్రతివారికి తెలిసినవిషయమే. బెంగాలు కరువు ఇందుకుదాహరణ. బియ్యంధర పెంచమనటం కూడా ఇందుకే దారితీస్తుంది. రాయలసీమ, పల్నాడు, విశాఖ మొదలగు ప్రాంతాల రైతాంగంతోసహా ప్రజలు డెల్టా ప్రజలపై ఆధారపడివున్నారు. అంతేగాక, డెల్టాగ్రామాలలోకూడా ధాన్యాన్ని కొనుక్కొనే పేద రైతులూ, ఇతరులూ ఎంతోమంది వుంటారు. వారికిపుడు రు 1 కి 3½ నుండి 4 పేర్లవరకూ అమ్మబడుతూవుంది. బియ్యం ధర పెంచమంటే, వీరికి రు 1 కి 3 పేర్లూ, ఇంకా తక్కువా ఇవ్వమనియేగదా! డెల్టాప్రాంతంలోని భూస్వాములనే దృష్టిలో పెట్టుకొని రు. 12/- ధర కోరితే రాయలసీమ, విశాఖ, పల్నాడు రైతాంగం ఈ కోర్కెను వ్యతిరేకించదా? ఇది రైతులలోనూ, రైతు వుద్యమంలోనూ చీలికలను తెచ్చుటగాదా?

బస్తాకు 12 నినాదం

అదే విధంగా దొంగమార్కెటులో అమ్మే ధరలను గూర్చి కూడా, చాలాచోట్ల బియ్యం దొంగమార్కెటులో అమ్మబడుతూన్నమాట నిజమే. నిడుద్రోలులోనే అటువంటి దొంగ మార్కెటు సాగుతోందని లక్ష్మీనారాయణ గారు చెప్పారు. అటువంటి సందర్భంలో దేశభక్తుల కర్తవ్యం ఏమిటి? ప్రజాబలంతో, చొరవతో దొంగమార్కెటును అరికట్టుటా, లేక దేశభక్తినే మర్చిపోయి, దొంగమార్కెటు ధరలను కోరుటా?

పై విషయాలన్నిటినీ గమనించే రు12/-ల ధర అసాధ్యమనీ, రు 11/- ధర న్యాయమైనదనీచెప్పాము ప్రస్తుతంఉన్న బియ్యంధరల ప్రకారం వడ్లకు ఎంతవరకూ ధర యివ్వ వీలుంటుందో అంతా రాబట్టుకొనుటకై ఆందోళన చేస్తే, రాష్ట్రమందలి ప్రజానీకమంతా బలపరుస్తుంది. మన ధాన్యాన్ని దొంగమార్కెటుకు పోనీయకుండా వుంటే, ఇదివరకే కంట్రోలు కాబడ్డ బట్టలు, మందులు, వ్యవసాయ పనిముట్లూ మొదలగు మన జీవితావసర వస్తువులనుదొంగమార్కెటులోకి పోనీయకుండా సంపాదించుకోగల్గుతాము. అందుకు ఇతర ప్రజాసామాన్యమంతా సహాయం చేస్తుంది. కాబట్టి డెల్టా ప్రాంతంలోని రైతుల దేశభక్తిని ప్రేరేపించక, రు 12/- లు కోరటం మన కోర్కెలను సాధించుకొనే మార్గముకాదు. రాష్ట్రమందలి మొత్తం రైతాంగానికి శ్రేయోదాయకంకాదు.

ధాన్య సేకరణ విధానం

ధాన్య సేకరణవిధానాన్నిగూర్చి కూడా వీరు ఇదే తప్పు దృక్పథంతో చూస్తున్నారు. నేటి ఆహారసమస్య పరిష్కారంలో రైతాంగముపై ప్రత్యేక బాధ్యతవున్నది. తాము పంటల నధికంగా పండించాలి. తమ అవుసరాలకు పోగా మిగిలిన దానిని కరువు ప్రాంతాల ప్రజలకు పంపాలి. ఇది మన ధర్మం. ఈ విధంగా మిగులు ప్రాంతాలనుంచి తరుగు ప్రాంతాలకు ధాన్యాన్ని పంపుటకే ప్రభుత్వం నేదొక ప్లానును అవలంబించ బోతూవుంది. అందలి ప్రధానోద్దేశం, రైతులకు పండిన పంటను అంచనావేసి, రైతుల అవుసరాలకు పోగా మిగిలిన దానిని ప్రభుత్వమేకొని, తరుగు ప్రాంతాలకు పంపుట. ఇన్నాళ్ళకైనా ఇట్టి ప్లానును ప్రభుత్వం అవలంబించుట ఎల్లరకూ ముదావహం. కాని ఇందులో కొన్ని లోపాలున్నాయి. ఆలోపాలను రైతులకు బాధకరంగాని రీతిగా సవరించమనికోరుట సబబుగాని, "చేలో పంట చేలోనే వుండాలి" అని తప్పు వ్యాఖ్యానంచేస్తూ వ్యతిరేకించటం రాష్ట్ర రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొనటంకాదు.

ఆహారసమస్యను పరిష్కరించవలసినది మనం. ప్రభుత్వం ఎన్ని అవకతవకలు చేసినా అత్యంతరాలు కల్గించినా, మన ప్రజలను మనం పోషించుకోవాలి. ఈ దృష్టితో చూడకపోవుటచేతనే పరిష్కారానికి అనుకూలంగాని పెడవాదాలను వీరు సాగిస్తున్నారు. కృష్ణాజిల్లాలో 40 ఎకరాలున్న రైతుకు వ్యవసాయంపై నష్టం వస్తోందని వీరు [illegible] దాను. మనిషికి రోజుకి [illegible] చేరు [illegible] కావాలన్నా ఏడాదికి 6 బస్తాలవడ్లు సరిపోవుండగా, వీరు 16 బస్తాలు [illegible] తున్నారు. ఏదో ఒక అర్థంలేనివాదన [illegible] కావలసిన ధాన్యంకంటె ఎక్కువ ధాన్యం నిల్వచేసికోనటం, పల్నాడు, రాయలసీమ, విశాఖ జిల్లాల రైతాంగాన్నిగాని, [illegible] ప్రజలనుగాని రక్షించుటకుపకరిస్తుందా?

కలిసి పనిచేయవచ్చు

కొన్ని ప్రధాన సమస్యలపై తీవ్ర భేదాభిప్రాయాలున్నమాటనిజమే. కాని ఇతరప్రధాన సమస్యలెన్నో వున్నాయి. విశాఖ కరువు నివారణ ఏ భేదాభిప్రాయాలకూ తావివ్వనిది. 2800 ఈనాం గ్రామాల రైతులసమస్యలో కూడా ఏ విభేదాలూ లేవు. ఎరువులు, వ్యవసాయ పనిముట్లూ దొంగ మార్కెటునుండి బయటకు లాగి రైతుల కందజేయుటలో కలిసి పనిచేయవచ్చు. కాని ఇటువంటివాటిపై గూడా వారు కలిసి పనిచేయుటకు నిరాకరించటం విచారకరం. ఇంతేకాదు. విశాఖ కరువునివారణకై ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం కరువుప్రాంతాలకు 12 గురు వలంటీర్లను పంపింది. ఎన్నో కష్టాలకు గురియౌతూ వారక్కడ పనిచేస్తున్నారు. ఆ జిల్లాలోని కిసాన్ కాంగ్రెసు వర్కర్లు కొంతమంది వారికి సహాయంచేయ ఉత్సహిస్తున్నారు. అయినాముఖ్యులైన సహారికృష్ణ మొదలైనవారు వలంటీర్లకు సహాయంచేయకపోవుటేగాక, చిక్కులుకూడా కల్గిస్తూ రావటం విచారకరం.

మా సంభాషణలు విఫలం కావడానికి కారణాలు తెల్పాము. ఇప్పటికీ విభేదాలకు తావీయని సమస్యలపై కలిసి పనిచేయాలనే కోరుతూవున్నాము. కిసాన్ కాంగ్రెసులో వున్న చాలామంది వర్కర్లుకూడా ఇందుకు కలిసిపోవాలని మేము ఎరుగుదుము. కాని భారతీదేవి ప్రభృతుల దృక్పథం ఇందుకు వ్యతిరేకంగా వుంది. కావున ఇట్టి ఐక్యతను సమకూర్చుబాధ్యత రైతుసంఘ సేవకులపైననూ, రైతాంగముపైననూ వున్నదని మనవిజేస్తూ అందులకై కృషి చేయవలసినదిగా కోరుతున్నాము.

ఇట్లు
చలసాని వాసుదేవరావు
కడియాల గోపాలరావు
నండూరి ప్రసాదరావు

స్త్రీలు పొలంపని చేసుకోడం తప్పుకాదు

★

ఇందుపల్లి మహిళల ఆదర్శమార్గం

— మానికొండ సూర్యావతి

మహిళాసంఘం ఇంతవరకు దేశపరిస్థితులను తెలియజేస్తూ, స్త్రీల విజ్ఞానాన్ని పెంపొందించుటకుగాను పఠన కేంద్రాలు నడుపుతోంది. పాయఖానా దొడ్లకొరకు ఆందోళన చేస్తోంది. దీనిఫలితంగా కొన్నిచోట్ల జయం పొందాం. నేడు ఈస్థితినుండి ఒక అడుగు ముందుకువేశాం. ఒకకొత్తఆదర్శాన్ని మహిళాసంఘం ప్రవేశపెట్టింది. అది ఏమిటి? రైతుస్త్రీలు ఊడ్పులకు (నాట్లకు), కలుపులకువెళ్లి ఒకనూతన సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. పొలం వెళ్ళుటకూడ ఒక గొప్పయేనా అనవచ్చును. నేడు మన సంఘంలో ఆచారాలు, అలవాట్లు ఏవిధంగావున్నవి, ఏపరిస్థితులలో వెళ్లారు - అనే విషయాలనుచూస్తే, ఇది నిజంగా గొప్పవిషయమే.

నేడు మన సమాజంలో, అందులోనూ మాగాణిప్రాంతాలలో రైతుస్త్రీలు పొలమువెళ్ళి పనిచేస్తే తప్పనీ, తమ గౌరవ, ప్రతిష్ఠలకు భంగమనీ భావిస్తున్నారు. ఈఆచారం ఎంత హానికలుగజేస్తూవుందో, ఎంతమంది బాధపడుతున్నారో ఒక్కసారి చూదాం.

మనదేశంలో ఎన్నిబీదకుటుంబాలున్నవో, ఎంతమంది తిండిలేక బాధపడుతున్నారో, మనకు తెలుసు. పేరుకు రైతులమనుకుంటూ తమ కుటుంబ పరిస్థితే గడువక బాధపడుతూ వున్న కుటుంబాలు అనేకం వున్నాయి. నాకళ్లారా చూచిన ఒకకుటుంబం సంగతి చెప్తాను. పేరుకు రైతుకుటుంబం. మూడురోజులనుంచి ఉపవాసం. పొలంపనిచేసుకుంటేనవ్వుతారేమో, మన కుటుంబంలో హీనంగా చూస్తారేమో, అన్నభయం. అప్పుతెచ్చుకుందామంటే మన స్థితి బాగులేదు గనుక ఇవ్వరేమోనని భయం. దీనిఫలితం; తిండిలేకపోవుట. లేనప్పుడు ఎలాగో పిల్లలకుమాత్రం వండిపెట్టి తాము పస్తులు పడుండటం. ఈసంగతి ఇతరులకు మాత్రం తెలియగూడదు; ఇలావున్నప్పుడు, ఆమె చాలా మంచిది; ఎన్ని బాధలువచ్చినా, ఉపవాసాలున్నా ఎవరికీ తెలియనీయదు; మహాఇల్లాలమ్మా అని ఇతరులు అంటారు. ఆమెయే గనుక కుటుంబపోషణకు పొలం పనికి వెళ్తే తప్పుపట్టుతారు. మరొక ఆమె నాతో స్వయంగా చెప్పిన విషయం యిది: "మా కుటుంబం గడచుట చాల కష్టంగావుంది. మేము బాగా పనిచేయగలం. కాని ఎవరైనా నవ్వుతారేమో; మీ బోటి వారెవరైనా వెళ్ళేటట్లయితే మేమూ వస్తాము. మేమే స్వయంగావెళ్తే తిడతారు" అని ఎంతో దీనంగా చెప్పింది. ఇటువంటి వెన్నో వున్నాయి. తోటి సోదరీమణు లెంతమందో ఈరకంగా సంఘ ఆచారానికి భయపడుతున్నారు. బాధలూ పడుతున్నారు. ఇట్టి స్థితిలోకూడా పొలం పనిచేస్తే తప్పనుకుంటున్నాం మనం. నేటికివి మెట్టప్రాంతాలలోను, కొన్ని పైకులాలలోను స్త్రీ పురుషులనకుండా కుటుంబమంతా కలసి పొలంపని చేసుకుంటారు. ఇటు మాగాణి ప్రాంతాలలోకూడా మొదట పొలంపని చేసుకుంటూనే వుండేవారు. కాని మధ్యలో నాగరికత పెరిగిన కొలదీ, పొలంపనిచేస్తే తప్పని భావిస్తూ వచ్చారు. ఇది ఎంత ఎక్కువగా ఉంటూవుందంటే తిండిలేకపోతే పస్తువుంటుటకైనా ఒప్పుకుంటారుగాని, పొలంపని చేయకూడదు అనే స్థితిలోవున్నాం. నిజమాలోచిస్తే మనకే తెలుస్తుంది. ఒక కుటుంబముందనుకోండి. ఆ కుటుంబ పోషణంతా పురుషుడొక్కడే తీసుకుంటే ఎంతికష్టం; ఆ బాధ్యతలో స్త్రీకూడా సగభాగం పంచుకుంటే ఎంత తేలిక; ఎంత సుఖంగా జీవితం గడిచిపోతుంది; పురుషునిపని కొంత తేలిక అవదూ;

జూన్‌లో, రైతుసంఘం మీటిసల్లయికిగాను బందరుకాలువ (బెజవాడలో) త్రవ్వుటకు పూనుకుంది. దానిలో కూలీలేగాక, రైతుబిడ్డలు, పెద్దపెద్దరైతులు, స్వయంగా పనిలో పాల్గొన్నారు. ఇంతేగాక బెజవాడలోని మహిళాసంఘంవారు, పాల్గొన్నారు. ఈ విషయం గ్రామాలకుకూడా ప్రాకింది. అప్పుడువారు ఎప్పుడూ పనిచేయని రైతులు, స్త్రీలు, బాగా చదువుకున్నవారుకూడా పాల్గొన్నప్పుడు మనంమాత్రం పనిచేస్తే తప్పేముందని ఆలోచించసాగారు. పనిచేస్తే తప్పుఅనే ఆచారాన్ని నాశనం చేయాలని పట్టుదల వహించారు. తరువాత ఊడ్పులసమయం వచ్చింది ఈ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురిసినందువల్ల కూలి ఎక్కువగా పెరిగింది. ఇదే అదనుగా తీసుకొని ఇందుపల్లి గ్రామములో (కృష్ణా) మొదట ఒకరోజు 25 మందిస్త్రీలు నాట్లలోపాల్గొన్నారు. ఆరోజు నర్రా నాగయ్యగారనే పెద్దరైతు చేలోకివెళ్ళారు. బీదరైతు కుటుంబాలనుండి, కొంచెం పెద్దరైతు కుటుంబాల స్త్రీలవరకు వచ్చారు. కొంతమంది తమ బిడ్డలను ప్రోత్సహించి ఎంతో వుత్సాహంతో పంపించారు. దేశరక్షణ, దేశస్వాతంత్ర్యం, స్త్రీల స్వాతంత్ర్యాలకు సంబంధించిన పాటలు పాడుతూ ఎంతో పట్టుదలతో పనిచేశారు. నిజంగా ఎప్పుడూ పొలంపని ఎరుగని స్త్రీలు నీళ్ళలో నిల్చొని ఊడ్చుట చాల కష్టమైనదే. అందులో వీళ్ళ పట్టుదలను పరీక్షించుటకా అన్నట్లు చేలోవుండగానే పెద్దవర్షం వచ్చింది. అయినా, ఇతర కూలీలంతా వెళ్ళిపోయినా, వీరు నిలబడి పనిపూర్తిచేశారు మాటలుచెప్పడమేగాని ఎప్పుడూ అలవాటులేని ఇంతశ్రమను వీరు చేయగలరా; అనే అనుమానాలుండేవి ప్రజలలో. అందుకని వీరు ఏవిధంగా పనిచేస్తారో, ఆ బురదలోనుండి అసలు కాళ్లు పెల్లగిలుతుందో లేదో అనుకుంటూ, పురుషులు కొంతమంది దూరంగాఉండి చూడసాగారు. నర్రా నాగయ్యగారు పనిచేస్తున్న స్త్రీలకెంతో ఉత్సాహమిచ్చారు. ఇంతటితో మానేయ్యగూడదు. ఇంకా ఎక్కువగా పని చెయ్యాలని, మహిళా సంఘాన్ని అభివృద్ధిపర్చాలని, ఉత్సాహమిచ్చారు. స్త్రీలు పొలంలో పనిచేయడమేమిటని ప్రశ్నించే వాళ్ళతో, తప్పేముందని వాదించేవారు. ఈ రకంగా అందరూ ప్రోత్సహిస్తే సంఘం ఇంకెంతో ముందుకు పోతుందిగదా; ఆరోజున వచ్చిన డబ్బును మహిళాసంఘానికి ఇవ్వవలెనని నిర్ణయించుకున్నారు. ఈ వుత్సాహముతోనే 8 ఎకరాలు కంట్రాక్టు తీసుకొని పూర్తిచేశారు. తరువాత కొంతమంది స్త్రీలు తమచేలల్లో స్వయంగా పనిచేసికొని, కొంత ఆదాయం గడించగల్గారు. తరువాత కలుపులకుకూడ వాళ్ళ పొలములలోకి వెళ్ళారు.

కాలువ త్రవ్వుప్రభావం, అందులో ఇందుపల్లి మహిళాసంఘం స్వయముగా వెళ్లుట చూచి, కాటూరు, జొన్నపాడు, లింగవరం, నూజెళ్ల గ్రామాలలోని స్త్రీలు ఊడ్పులకువెళ్లి, ఒక కొత్తపద్ధతిని ప్రవేశపెట్టారు.

గుంటూరుజిల్లాలో దావులూరు మహిళాసంఘం, చైతన్యంతోపనిచేస్తోంది. వాళ్ళజిల్లా మహాసభకు, రైతుమహాసభకు కాలినడకను వెళ్ళి పాల్గొన్నారు తమ మహిళాసంఘానికి ఫండు ప్రోగుచెయ్యాలనుకొన్నారు. ఊడ్పుల కాలంలో వ్యవసాయకూలీలు 13గురు, జిల్లా మహిళాసంఘ కార్యనిర్వాహక సభ్యురాలగు చింతల కోటేశ్వరమ్మగారి నాయకత్వాన ఊడ్పుకు వెళ్లారు. రైతుగేయాలతో, మహిళాసంఘపు పాటలతో, బయలుదేరి పొలంలో పనిచేశారు వచ్చినడబ్బును మహిళాసంఘానికి ఇచ్చారు.

ఇంతేకాదు, కుటుంబఆదాయానికి, ఆహారసమస్యను పరిష్కరించడానికి, గ్రామమహిళాసంఘాల తరపున కూరగాయల మొక్కలను పెంచుతున్నారు. పెదమద్దాలి, లింగవరం గ్రామాల్లో ఒక దొడ్డి తీసుకొని వంగ, పెండలం మొదలైన కూరగాయలు వేసి ఆదర్శంగా పనిచేస్తున్నారు. అన్ని గ్రామాలలోను, మహిళలీవిధంగా ఆదర్శంగా పనిచేయాలి; తమ తమ పొలాల్లో పనిచేయడానికి జంకగూడదు. మధ్యతరగతి స్త్రీలు, ఉన్నత కుటుంబాలవాళ్ళు ముందుకొచ్చి ఈవిధంగా పనిచేస్తే, ఎంతోమంది పేదకుటుంబాలను కాపాడినవారవుతాం.

తిరువూరుతాలూకాలో మొఖాసాదార్ల దండయాత్ర

— అనుమర్లపూడి సీతారామారావు

తిరువూరుతాలూకాలో, చాట్రాయివిన్నా మొఖాసాదార్ల దౌష్ట్యాలకు అటపట్టు. 1940లో జరిగిన జిల్లాబోర్డు యెన్నికలలో చనుబండ, సూరంపాలెం, గుడిపాడు మొదలైనగ్రామాల్లో రైతుల పైన్లు, పుగతోటలు కోయించడం, యింకా అనేక అఘాయిత్యాలు చేయడం జరిగింది ఈ పాతచర్యలన్నీ మరల ఈనాడు చెలరేగుతున్నాయి.

ఈ ప్రాంతంలో చెరువులకు యిక్ష్వాకుల నాటి మరమ్మతులుతప్ప చేసేమన్నపోసిన పాపానపోలేదు మొఖాసాదార్లు. శిస్తులబాధ విపరీతం. అడవుల్లో పశువుల్ని మేపుకోడానికి, వ్యవసాయపనిముట్లు తెచ్చుకోడానికి రైతులకు హక్కు ఉన్నా, మొఖాసాదార్లు పశువులను బందిలిదొడ్డిలో పెట్టడం మామూలైంది. చెర్వు మరమ్మతులకొరకై రైతులుప్రభుత్వం యిచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని పిటీషనులు పెట్టుకున్నారు. దీనికి ఫలితంగా 20 చెర్వులకు మరమ్మతులు పూర్తిఅయినాయి. మరమ్మతులు కావలసిన, చెర్వులు యింకా 25 వుంటాయి

1940 లో చెల్లించిన శిస్తులకు రశీదులివ్వకుండా, మొఖాసాదార్లు రైతులపై, సూట్లు బనాయించారు. ఈ విధంగా రైతులు కోర్టులపాలు కావలసివచ్చింది. అక్రమంగా జరీబుతోటలపై విధించబడ్డ శిస్తు జిల్లాకోర్టులో తీసివేయబడింది. పల్లంశిస్తుమాత్రం నిలిపారు.

జాయింటుపట్టాల బాధానివారణకు, రికార్డు సెటిల్‌మెంటుకు, రైతులు దావావేశారు. దానికిగాను 30—9—43 న రు. 2512 లు డిపాజిటుచేశారు. ఈ పరిస్థితులన్నీ తమ బూటకత్వాన్ని బయటపెట్టేవిగా వున్నందున మొఖాసాదార్లు కులకక్షలుపెట్టి హింసించుటకు, మందబయళ్లు దున్నించుతూ కొందరు కూలీలను రెచ్చగొట్టారు. రైతులు అడవికి యింజంక్షను దావా వేశారు కోర్టువారిచే నియమించబడ్డ కమీషనరు రిపోర్టు వ్రాసినమీదట మొఖాసాదార్ల ఆగ్రహం తారామండలానికి ప్రాకింది. ఇక పశుబలమే ఆయుధమని నిశ్చయించుకొని, దానిని ప్రయోగించ నారంభించారు. ఇండ్లు పడగొట్టించడం, చేలు మించడం మొదలైన నానాభీభత్సానికి తలపడ్డారు. రైతులను లొంగదీయడానికి ప్రతిరోజు అక్రమంగా పశువులను దొడ్డికి తోలుతున్నారు. ఎన్నెన్ని విధాల నిరంకుశం సాగించాలో అన్నివిధాలా సాగిస్తూవున్నారు. ఈ పరిస్థితులన్నీ జిల్లాకలెక్టరుకు తెలియజేయబడ్డాయి.

ఇదివరలో బెజవాడ సబ్‌కలెక్టరు పశువులను మేపుకునేహక్కును రైతుకుస్థిరపరుస్తూ తీర్పుకూడా యిచ్చారు.

తిరువూరు తాలూకా, మల్లవరం గ్రామంలోని సాముదాయక బీడును అన్యాక్రాంతంచేసి రైతులపై క్రిమినలు కేసులుకూడా పెట్టారు. తాలూకాలో, చట్రాయి మొదలైన గ్రామాల్లో గూడా మొఖాధార్ల వత్తిడి నానాటికి అధికమవుతున్నది.

రైతులు కోర్టులద్వారా తమ హక్కులను సాధించు కుంటున్నారనే క్రోధోద్వేగంతో మొఖాసాదార్లు యిలాంటి నిరంకుశ చర్యలకు పూనుకున్నారు. రైతుసంఘాలు బలపడి, ఐక్యతద్వారా బంజరు సాగుచేయించుకొనడం, చెర్వులు మరమ్మతు చేయించుకొనడంవల్ల, ప్రజలపోరాటశక్తి యినుమడించడం మొఖాసాదార్లకు కంటకమయింది ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి, రైతులను లొంగదీయడానికి యెలాంటి నీచకత్యాలకైనా దిగడానికి మొఖాసాదార్లు వెనుదీయలేదు.

ప్రభుత్వం యీ విషయంలో వెంటనే జోక్యం కల్పించుకొని, న్యాయం కలుగజేయాలి, రైతులు మొఖాసాదార్లు పెట్టే నిరంకుశ చర్యలకు రెచ్చకుండా, ఐక్యతే తమ ఆయుధంగా యెంచుకొని తమ న్యాయమైన హక్కులకై తీవ్ర ఆందోళన చేయాలి.

ప్రజాశక్తి

★

భారత కమ్యూనిస్టు పార్టీ

ఆంధ్రకమిటీ పత్రిక

★

సంపాదకులు :

మద్దుకూరి చంద్రశేఖరరావు

Printed and Published by
Katragadda Rajagopala Rao
at Prajasakti Press,
Governorpet - Bezwada.

END OF ISSUE